ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 25 డిసెంబరు 2024



డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యాలయ అధికారులు, ఉద్యోగులు

డీఎంహెచ్‌వోగా డాక్టర్ మాలిని బాధ్యతల స్వీకరణ

ఏలూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతి, బదిలీపై గుడివాడ ఏరియా ఆస్పత్రి నుంచి కొత్త డీఎంహెచ్‌వోగా జిల్లాకు నియమితులైన డాక్టర్ ఆర్.మాలిని మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. తొలుత కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇప్పటివరకు డీఎంహెచ్‌వోగా పనిచేసిన డాక్టర్ శర్మిష్ట కృష్ణా జిల్లాకు బదిలీ అయిన విషయం విదితమే. కాగా కొత్త డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని తొలుత ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖలో చింతలపూడి తదితరచోట్ల ఎస్పీహెచ్‌వోగా పనిచేస్తూ సుమారు దశాబ్దం క్రితమే ఏపీ వైద్యవిధాన పరిషత్‌కు వెళ్ళారు. మళ్ళీ ఇప్పుడు మాతృశాఖకు వచ్చారు. నూతన డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినికి కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో..

నేడు క్రీస్తు జన్మించెను

జిల్లా అంతటా క్రిస్మస్ సందడి నెలకొంది. పండుగకు చర్చిలు విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి. అయా ప్రార్థనా మందిరాల్లో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఏలూరులోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి, మన్నా చర్చిలో మంగళవారం రాత్రి విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలతో క్రిస్మస్‌కు స్వాగతం పలికారు.



మన్నా చర్చిలో..



ఏలూరు పోణంగి రోడ్డులోని టిడ్కో ఇళ్ల దుస్థితి

అందని ఆవాసం!

టిడ్కో ఇళ్లపై కక్ష కట్టి ఆపేసిన జగన్ సర్కారు

- గత ఐదేళ్లు వీటివైపు చూడని వైనం
- అందుబాటులోకి రాని టిడ్కో ఇళ్ల సముదాయాలు
- ఒక్కటి పూర్తయితే ఒట్టు ..
- టీడీపీ హయాంలో రూ.కోట్ల ఖర్చు .. నేడు ఇంట్లో అడుగు పెట్టలేని స్థితి
- జిల్లాలో మంజూరైనవి 11 వేల 374
- నిర్మాణం చేపట్టింది 5 వేల 712
- నెరవేరని పేదల సొంతింటి కల

కళ్లల్లో సొంతింటి కల.. కంటి ఎదురుగా ఎటూ పూర్తి కాని ఆవాసాలు. ఒకరోజు కాదు.. రెండు రోజులుకాదు. ఏడేళ్లుగా వీటికోసమే తాపత్రయం. కేటగిరి చొప్పున ఇళ్లకు ఇంత ముందస్తు సొమ్ము కట్టాలంటూ జమ చేసుకున్నారు. ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల గృహ సముదాయాల్లో పిచ్చి మొక్కలు పెరిగి విషకీటకాలకు ఆవాసమయ్యాయి. అసాంఘిక కార్యక్రమాలకు ఆ ప్రాంతమే ఆలవాలమైంది. కాని సొంతింటి ప్రవేశం కల నెరవేరడం లేదు. ఏలూరు జిల్లాలో ఉన్న టిడ్కో గృహ సముదాయాల్లో ఇప్పటికీ ఏ ఒక్క గృహం గృహ ప్రవేశాలకు అనుకూలంగా లేనేలేదు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

2018లో తొలిసారిగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో టిడ్కో ఇళ్ల ఆలోచన వచ్చింది. దీనికి అనుగుణంగానే ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో సముదాయాలను నిర్మించేందుకు నిర్ణయించడమే తరువాయి చకచకా పనులు సాగాయి. పక్కాగా పటిష్ట నిర్మాణంతో పాటు మూడు కేటగిరీల వారీగా ఈ గృహాలను విభజించారు. పేద వర్గాలకు చెందిన వారిలో కొందరిని ఎంపిక చేసి టిడ్కో ఇళ్లు కేటాయించారు. అంతకుముందు ఇళ్ల కాలనీల మాదిరి కాకుండా టిడ్కో ఇళ్ల సముదాయానికి పక్కా ప్లాన్ చేశారు. విశాలమైన రోడ్లే కాకుండా ఇతర ప్రాంతాల కనెక్టవిటిని దృష్టిలో ఉంచుకుని మరీ నిర్మించారు. ఇంత చేస్తే ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో జరిగినట్టే టిడ్కో గృహ సముదాయం విషయంలోను విధ్వంసమే సాగింది. కోట్లాది రూపాయలు వెచ్చించడమే కాకుండా పేద వర్గాల నుంచి రిజర్వు ఫండ్‌ను సేకరించిన దరిమిలా నిర్మాణాలు పూర్తి చేయాల్సింది పోయి.. అసలు వాటి ఊసెత్తడమే మానేశారు. కేవలం తెలుగుదేశం హయాంలో టిడ్కో నిర్మాణం సాగింది కాబట్టి అప్పుడు ఎంపికైన లబ్దిదారులంతా ఆ పార్టీకి అనుకూలమే అన్నట్టుగా కక్షకట్టి నిలిపేశారు. పేదల కంటే పార్టీయే ముఖ్యమన్నట్టుగా టిడ్కో సముదాయాలకు బులుగు రంగులు పులిమారు.

- ఏలూరులో హడావుడిగా 6 వేల 480 టిడ్కో గృహాలను పేదలకు మంజూరు చేశారు. వీటిలో మూడో వంతు 2 వేల 208 నిర్మాణాలు చేపట్టినా అవి కూడా 80 శాతం మేర పూర్తయ్యాయి. పైకి తలుపులు బిగించినట్టు కనిపిస్తున్నా విని యోగం లేకపోవడంతో అవి కుప్పకూలడానికి సిద్ధంగా ఉన్నాయి. టాయిలెట్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

- నూజివీడు, నియోజకవర్గ కేంద్రంలో టిడ్కో పరిధిలో 4 వేల 30 గృహాలను మంజూరు చేశారు. 'ఏ' కేటగిరీలో 864, 'బీ' కేటగిరీలో 864, 'సీ' కేటగిరీలో 912 మొత్తం మీద 2,640 గృహాల నిర్మాణం మాత్రమే ఆరంభించారు. ఈ సముదాయం ఆరంభం నుంచి ఇప్పటివరకు అంతా వివాదాలమయమే. గత ఐదేళ్లల్లో ఆలనాపాలనా లేక వివిధ దశల్లో ఉన్న టిడ్కో ఇళ్లన్నీ పిచ్చిమొక్కలకు ఆలవాలమ య్యాయి. ఆఖరుకి అక్కడక్కడ ఇనుప సామగ్రి పూర్తిగా తుప్పుపట్టి రాలిపోయే పరిస్థితి. ఏ ఒక్క గృహం కూడా పేదలు వచ్చి వాలేందుకు ఇప్పటికిప్పుడు అనుకూలంగా లేనేలేవు.

లబ్ధిదారులనే గల్లంతు చేశారు..

అసలు ఇప్పుడు టిడ్కో ఇళ్ల నిజమైన లబ్దిదారులు ఎవరో నిర్ధారించలేని విధంగా ఉంది. ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో వలంటీర్లు రెచ్చిపోయి పక్కా ఇంటి స్థలం కావాలా.. వద్దా అంటూ ఒత్తిడి చేసి మరీ టిడ్కో ఇళ్లకు గుడ్‌బై చెప్పి ఇంటి స్థలం మాత్రమే తాము కోరినట్టు లేఖలు రాయించుకుని మరీ గందరగోళం సృష్టించారు. ఇంతకు ముందు టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులుగా ఎంపిక చేసిన వారిలో మూడొంతులు మంది ఇలా ఇళ్ల స్థలాలు తీసుకున్నారు. మరి ఇప్పుడు ఎవరికైనా కేటాయించాలని ప్రయత్నిస్తే ఎవరికి వస్తాయో తెలియని పరిస్థితి.



ఏలూరు టిడ్కో నివాస సముదాయంలో గదుల దుస్థితి



- జంగారెడ్డిగూడెంలో 864 ఇళ్లతో టిడ్కో సముదాయం నిర్మించేందుకు సంకల్పించారు. వీటిలో 804 గృహాల నిర్మాణం ఆరంభించారు. ఇక్కడ 'ఏ' కేటగిరి రద్దు చేసి 'బీ', 'సీ' కేటగిరీ కింద మాత్రమే ఇళ్లను కేటాయించారు. పోని ఇవన్నా పూర్తి చేశారా అంటే అదీలేదు. ఇక్కడ ఉన్న ఇళ్ళన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. తలుపులు బిగించలేదు. టాయిలెట్ల నిర్మాణం జరగలేదు. నీటి వసతికి అనువైన పరిస్థితులు సృష్టించలేదు. కేవలం చిట్టడవిలో నిట్ట నిలువునా లేచిన నిర్మాణాలే పైకి కనిపిస్తాయి. భవనాల లోపల అనేక చోట్ల చెదలు చేరాయి. నిర్మాణ పనులన్నీ 70 శాతానికే ముగిశాయి. మిగతా పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియదు.



28 నుంచి అప్రంటీస్‌షిప్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో అప్రంటీస్‌షిప్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు జరపనున్నట్టు విజయవాడ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ వి.నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీలో అప్రంటీస్‌షిప్ చేయడానికి ఈ ఏడాది నవంబరు 6వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలనను చేయనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 73829 00591, 73829 00299, 79897 90054, 83090 89998, 73828 99018, 81421 88168 ఫోన్ నెంబర్లతో ఆఫీసు పనివేళల్లో మాత్రమే ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించాలన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు అమానుషం



ఏలూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో కించపరిచేలా కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం అమానుషమని, కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గ నాయకులు జేసీ ధాత్రిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తొలుత కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనాల రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తదితరులు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమా నించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా పదవికి బేషరుతుగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుబ్బారావు, మరీదు కృష్ణ, నగర బ్లాక్-1 అధ్యక్షుడు చక్కా గుప్తా, బ్లాక్ -2 అధ్యక్షుడు లంకా రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖకు అవినీతి రోగం
షాడో వైద్యాధికారికి కొత్త డీఎంహెచ్‌వో చికిత్స తప్పనిసరి
ఐదు కీలక విభాగాలకు ఒక్కరే దిక్కు!
ఉద్యోగులకు అక్రమ డిప్యుటేషన్లు
7



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మేయర్ నూర్జహాన్, సభ్యులు

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం

- 19 అంశాలతో కూడిన ఏజెండా ఏకగ్రీవంగా ఆమోదం
- సంక్రాంతి నాటికి రోడ్లపై గుంతలు లేని నగరంగా తీర్చిదిద్దుతాం : మేయర్ నూర్జహాన్

ఏలూరు టూటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పాలక మండలి సర్వసభ్య సమావేశం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. 19 అంశాలతో కూడిన ఏజెండాను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మేయర్ మాట్లాడుతూ 2022 - 23 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 కోట్ల 69 లక్షలతో నగరంలో 87 పనులు చేయడానికి ఆమోదం తెలిపామన్నారు. 2023 - 24 సంవత్సరాలకు 15వ ఆర్థిక సంఘం సెకండ్ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.3 కోట్ల84 లక్షలతో 10 అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామన్నారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు విధి నిర్వహణలో మరణించినవారికి రూ.15 వేలు ఆర్థిక సహాయం కుటుంబానికి చెల్లిస్తామన్నారు. గత ప్రభుత్వ పాలనలో నగరంలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయని అన్నారు. నగరంలో కోటి 25 లక్షలతో రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సంక్రాంతి నాటికి గుంతలులేని నగరంగా తీర్చి దిద్దుతామన్నారు. నగరాన్ని పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాలకమండలిలో కార్పొరేటర్లంతా టీడీపీలోకి రావడంతో కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా నడిచింది. ఎవరూ ఎటువంటి అభ్యంతరాలు లేవనెత్తకపోవడంతో ఏజెండాలోని 19 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. కాపుకల్యాణ మండపానికి కేటాయించి స్థలం కోర్టువివాదంలో ఉండటంతో ఆ స్థలంలో కాకుండా వేరే స్థలం కేటాయించామని మేయర్ తెలిపారు. కమిషనర్ భానుప్రతాప్, కోఅప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, చోడే వెంకటరత్నం, డిప్యూటీ మేయర్లు గుడిదే శ్రీనివాస్, నూకపేయి సుధీర్‌బాబు, అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వైసీపీ నేత అరెస్ట్

కైకలూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులపై దాడి చేసిన వైసీపీ జిల్లా ఎస్సీ విజిలెన్స్ కమిటీ మానిటరింగ్ సభ్యుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు కైకలూరు టౌన్ ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఈనెల 18న కైకలూరులో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండగా మండలంలోని ఆటపాక శివారు జాన్‌పేటకు చెందిన కూనవరపు సతీష్ కుమార్ అలియాస్ జాన్‌పేట సతీష్ మరో ముగ్గురు కలిసి ఆర్గనైజర్లతో గొడవపడి గడిదేశి విజయకుమార్ అనే వ్యక్తిని గాయపరిచారు. క్షతగాత్రుడు ప్రభుత్వాస్పత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం మచిలీపట్నంలో జాన్‌పేట సతీష్‌ను ఎస్ఐ వెంకటకుమార్ అరెస్ట్ చేసి కైకలూరు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అనేక ఘటనల్లో దాడులకు పాల్పడినట్టుగా పోలీసులు పేర్కొన్నారు.



అరెస్టు చేసిన వైసీపీ నాయకుడు జాన్‌పేట సతీష్‌ను చూపుతున్న ఎస్ఐ వెంకట్‌కుమార్

27 నుంచి ఎస్ఎంసీలకు శిక్షణ షెడ్యూల్ విడుదల

ఏలూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకు ఇటీవల ఎన్నికల ద్వారా ఏర్పాటైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులకు వారి హక్కులు, బాధ్యతలపై శిక్షణనిచ్చేందుకు షెడ్యూలు ఖరారైంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 1,841 ఎస్ఎంసీలున్నాయి. కొంతకాలం క్రితం పశ్చిమ గోదావరి జిల్లాలో విలీనమైన గణపవరం మండలంలోని ఎస్ఎంసీలకు ఇటీవల జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు (పీటీటీ) ఏలూరు జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలోనే నిర్వహించినందున, తాజాగా సంబంధిత ఎస్ఎంసీలకు ఇదే జిల్లాలో శిక్షణనివ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మొత్తం మూడు దశల్లో శిక్షణ పూర్తవుతుంది. తొలిదశలో ఈనెల 27 నుంచి 30 లోగా స్థానికంగా డివిజనల్ విద్యాశాఖాధికారి (డీవైఈవో) నిర్ణయించే ఒకరోజున జిల్లా స్థాయి శిక్షణ ఉంటంది. జంగారెడ్డిగూడెం, ఏలూరు, నూజివీడులలో నిర్వహించే ఈ శిక్షణకు సంబంధిత డివిజన్ పరిధిలోని ఒక్కో మండలం నుంచి ముగ్గురు టీచర్లు, ఇద్దరు ఎస్ఎంసీ సభ్యులు చొప్పున హాజరు కావాల్సి ఉంటుంది. వీరంతా ఈనెల 31 నుంచి జనవరి రెండో తేదీలోగా మండల స్థాయి శిక్షణను ప్రతీ స్కూలునుంచి ఒక టీచరు, ఒక ఎస్ఎంసీ సభ్యుడికి ఇస్తారు. ఇలా శిక్షణ పొందిన వారు జనవరి రెండో తేదీ నుంచి ఆరో తేదీలోగా ప్రతీ స్కూలులో ఎస్ఎంసీలకు శిక్షణ ఇవ్వడంతో షెడ్యూలు ముగుస్తుంది. శిక్షణ తరగతులను పర్యవేక్షించేందుకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు పరిశీలకులుగా సమగ్రశిక్ష 'సీమ్యాట్' విభాగంలో అసోసియేట్ ఫెలోగా వ్యవహరిస్తున్న కె.ఆర్.ఎం.ప్రతిష్ట నియమితులయ్యారు.

'పది' పరీక్ష ఫీజు చెల్లింపునకు తత్కాల్ స్కీం

ఏలూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు తత్కాల్ స్కీం కింద ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 27 నుంచి జనవరి 10వ తేదీ వరకు గడువు ఉందని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను మాత్రమే తదుపరి జరిగే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేందుకు అనుమతిస్తామని స్పష్టం చేశారు.

అల్పపీడనం.. గుబులు!

- జిల్లాలో కురుస్తున్న నానుడు వానలు..ఆందోళనలో అన్నదాత
- 85 శాతం పైగా పూర్తయిన వరి కోతలు
- పెరిగిన చలిగాలుల తీవ్రత
- ఆక్వా రైతుల ఆందోళన.. హడావుడిగా పట్టుబడులు



జాలిపూడిలో బరకాలు కప్పిన ధాన్యం

ఏలూరు సిటీ/ ఏలూరు రూరల్/పోలవరం/ ముదినేపల్లి/లింగపాలెం/ కలిదిండి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో నానుడు వానలు కురుస్తున్నా చలి గాలులు తీవ్రత విపరీతంగా పెరిగింది. దీనిప్రభావంతో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ అందక పోవడం వంటి పరిణామాలు ఏర్పడుతున్నాయి. మంగళవారం తెల్లవారుఝాము నుంచి చలి గాలుల తీవ్రత విపరీతంగా పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు తార స్థాయికి పడిపోయాయి. రాత్రి ఉష్ణోగ్రతలు 21 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు నమోదవుతున్నా అల్పపీడన ద్రోణి కారణంగా చలి తీవ్రత విపరీతంగా కనిపిస్తోంది. జిల్లాలో చలిగాలుల తీవ్రత 25 కిలో మీటర్లు వరకు ఉందని, గాలిలో తేమ శాతం 87 శాతం వరకు ఉందని నెట్ సమా చారం ద్వారా తెలుస్తోంది. జిల్లాలో 80 శాతం పైగా వరి కోతలు పూర్తయ్యాయి. ఈ దశలో వరి కోతలు చివరి అంకానికి చేరుకున్నాయి. జిల్లాలో 1.91 లక్షల ఎకరాల్వో సార్వా వరి సాగు చేయగా ఇప్పటివరకు 1.63 లక్షల ఎకరాలకు పైగా వరి కోతలు పూర్తయ్యాయి. చివరి అంకం లో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతామే మోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కోసిన వరి పంటను బరకాలు కప్పి, పలుచోట్ల కుప్పలు వేసుకుని రక్షించుకుంటున్నారు. ఆర బెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలిస్తు న్నారు. ఏలూరు రూరల్ మండలంలో సుమారు 16వేల హెక్టార్‌లలో వరిసాగు జరుగుతోంది. వర్ష సూచనతో పూర్తిగా ఆరకపోయినా రెండురోజులుగా వరి కుప్పలు పెట్టారు. పోలవరం మండలంలో ఇప్పటికే కోతలు కోసిన ధాన్యాన్ని పోలవరం, పట్టిసీమ కొత్తపట్టిసీమ, గూటాల గ్రామాల్లో ఆరుబయట ఆర బెట్టిన ధాన్యాన్ని రైతులు భద్రపరుచుకునే పనిలో నిమగ్నమయ్యారు. ముదినేపల్లి - గుడివాడ జాతీయ రహదారి వెంబడి ఎక్కడ చూసినా తేమ శాతం తగ్గించేందుకు ఆరబెట్టిన ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. పొలాల్లో నేల కొరిగిన వరి పైరు వర్షాలకు పాడైపోయే పరిస్థితి ఏర్పడింది. ముదినేపల్లి ప్రాంతంలో సుమారు రెండు వేల ఎకరాల్లో వరి పైరు కోయాల్సి ఉన్నట్లు సమాచారం. సుమారు ఆరు వందల ఎకరాల్లో వరి కుప్పలు ఉన్నాయి. అల్పపీడనం ఫలితం మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యంలో తేమ శాతం పెరుగుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. లింగపాలెం మండలంలో ధాన్యం తడవకుండా కాపాడుకొనేందుకు రైతులు బరకాలు కప్పుతూ ఇబ్బందులు పడ్డారు.మరోవైపు వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. జలుబు, జ్వరం, దగ్గు వంటి వ్యాధులతో పాటు శ్వాసకోశ సంబంధ వ్యాధుల తీవ్రత పెరిగింది.



పోలవరంలో కురుస్తున్న వర్షం



ముదినేపల్లి ప్రాంతంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ట్రాక్టర్ వినియోగం

ఆక్వా ఉక్కిరిబిక్కిరి

అల్పపీడన ద్రోణి కారణంగా తీవ్రంగా వీస్తున్న చలిగాలులు కారణంగా కైకలూరుతో పాటు కొల్లేరు పరిసర మండలాలలో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ పడిపోతోందని , ఈ కారణంగా రొయ్యలు చనిపోయే అవకాశం ఉందని సంబంధిత రైతులు చెబుతున్నారు. రైతులు నిరంతరం ఏరియేటర్లును తిప్పాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆక్సిజన్ తగ్గిపోతే రొయ్యలను కాపాడుకోవటనికి సంబంధిత మందులను కొనుగోలు చేసి రొయ్యల చెరువుల వద్ద సిద్దంగా ఉంచుకున్నారు. కలిదిండి మండలంలో 23 వేల ఎకరాల్లో చేపల సాగు 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో చెరువుల్లో చేపలు, రొయ్యలకు ఆక్సిజన్ అందక అల్లాడుతున్నాయి. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో కొంతమంది రైతులు చిన్న సైజు చేపలను పట్టుకోవడంతో కనీసం పెట్టుబడులు రావడం లేదని వాపోతున్నారు. చేపల ధరలు భారీగా తగ్గిపోవడంతో ఎకరానికి రూ.25 వేలు వరకు నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు



పెదలంకలో హడావిడిగా చేపల పట్టుబడి


పెనుగొండ పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు


ఏలూరు రూరల్‌లో శాంతాక్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు


పాలకొల్లు పట్టణంలో చిన్నారుల సందడి


జంగారెడ్డిగూడెం పట్టణంలో బొమ్మ శాంతాక్లాజ్‌లు


ఏలూరు మన్నా చర్చిలో కొవ్వొత్తులతో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

శాంతికి చిహ్నం క్రిస్మస్



• వేడుకలకు ముస్తాబైన చర్చిలు • విద్యుత్ వెలుగుల నక్షత్రాలు • ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు • చిన్నారి శాంతాక్లాజ్‌ల సందడి



క్రీస్తు జీవితం ఆదర్శప్రాయం

ప్రముఖుల శుభాకాంక్షలు

త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసు క్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి అందించారని పలువురు ప్రముఖులు అన్నారు. క్రీస్తు జీవితం ఆదర్శప్రాయమని ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమ కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, పెదవేగి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు క్రైం, టూటౌన్ / చింతలపూడి / పెదవేగి / భీమవరం టౌన్


ఏలూరు టూటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. క్రీస్తు జన్మించి 2వేల సంవత్సరాలు అయినప్పటికి కరుణామయుడిగా ఆరాధనలు అందుకుంటున్నారు. రెండు వేల సంవత్సరాల క్రితం రోమ్ సామ్రాజ్యాధినేత అగస్టస్ సీజర్ తన రాజ్యంలో జనాభా ఎంతున్నారో తెలుసుకోవాలనుకున్నారు. ప్రజలందరిని డిసెంబరు 25లోపు స్వగ్రామాలకు వెళ్లాలని ఆజ్ఞాపించారు. అదే సమయంలో నజరేతు అనే ఊరిలో మరియమ్మ, యోసేబులకు ప్రదానం అయ్యింది. అప్పటికి పెళ్లి కాలేదు. ఈ లోపు మరియమ్మకు కలలో దేవదూత గాబ్రియేల్ కనిపించి నేడు దేవుని అనుగ్రహం పొందావు. పరిశుద్ధ ఆత్మతో గర్భం దాల్చి కుమారుడిని కంటావు. ఆ బిడ్డకు ఏసు అని పేరు పెట్టాలి. ఏసు అంటే రక్షకుడు అని అర్థం. మరియమ్మ దేవదూత మాటలపై విశ్వాసంతో దేవుడిని ప్రార్థించింది. అనంతరం పరిశుద్ధ ఆత్మతో గర్భం దాల్చింది. ఇదే విషయాన్ని మరియకు ప్రదానం చేసిన యోసేబుకు కూడా దేవదూత కనపడి మరియమ్మ పరిశుద్ధ ఆత్మతో గర్భం ధరించింది. ఆమెకు పుట్టే బిడ్డ పరిశుద్ధ ఆత్మడై దేవుని కుమారుడు అనబడును. ఆయన తన ప్రజలందరిని వాళ్ల పాపాల నుంచి రక్షిస్తాడని చెప్పాడు. దేవదూత మాటలతో యోసేబు మరియమ్మను తీసుకుని స్వగ్రామం బెత్లహేమ్‌కు బయల్దేరి వెళ్లాడు. అక్కడ వారికి ఎటువంటి వసతి దొరకనందున పశువుల పాకలో ఆశ్రయం దొరికింది. పశువుల పాకలోనే మేరి ఏసుకు జన్మనిచ్చింది. ఆ సమయంలో ఆకాశం నుంచి దేవదూత దిగివచ్చి గొర్రెల కాపరులు మీ కొరకు బెత్లహేమ్‌లో పశువుల పాకలో రక్షకుడు పుట్టాడు. ఆయనే ప్రభువైన ఏసుక్రీస్తు ఆయనే మీ అందరికి ప్రభువు. బెత్లహేమ్‌లో పశువుల తొట్టిలో పొత్తిగుడ్డలతో చుట్టి మరియతో ఉంటాడు. అతడే లోకరక్షకుడు అని దేవదూత చెప్పింది. ఆ గొర్రెల కాపర్లు ఏసుపుట్టిన చోటుకు వెళ్లి ఆయనను ఆరాధిస్తారు. ఏసుపుట్టిన రోజునే క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారు.

క్రీస్తు ప్రేమను ఆచరణలో చూపడమే క్రిస్మస్




ఏసుక్రీస్తు ప్రేమను ఆచరణలో చూపడమే నిజమైన క్రిస్మస్. సమస్త ప్రాణులతో స్నేహభావం దయ కలిగిన వాడు ఏసు ప్రభు. ఏసుక్రీస్తు 2024 ఏళ్ల క్రితం భూమిపై సంచరించి సర్వమానవాళికి తన ప్రేమను పంచారు. ఆ మహనీయుని పవిత్ర పేమ, దయ, శాంతిని అందరం ఆచరణలో చూపినప్పుడే నిజమైన క్రిస్మస్ ఆనందం కలుగుతుంది. బైబిల్‌లోని ప్రభువు చెప్పిన ప్రవచనాల్లో ప్రేమ, కరుణ, దయను అనుసరించడం ద్వారానే ప్రపంచంలో ప్రేమ, సామరస్యాలు సాధ్యమవుతాయి. ఆనందరకరమైన భూమిపై క్రీస్తు జన్మించినప్పుడే ఈ లోకానికి నిజమైన వెలుగు వచ్చింది. ఏసుక్రీస్తు ఎవరి జీవితాల్లో ప్రవేశిస్తే వారిలో వెలుగు నిండుతుంది. శాంతి, ప్రేమ, కరుణకు చిహ్నంగా నిలిచేదే క్రిస్మస్. మనుషుల్లో మాలిన్యాన్ని వెలికి తీసి సమాజాన్ని సంస్కరించేందుకు వచ్చినవాడే ఏసుప్రభువు. ఆయన చూపిన మార్గంలో ప్రజలంతా పయనించాలి.

ఎం.జ్యోతిరాజు, పాస్టర్, మన్నా చర్చ్


ఉండి ఎస్ఆర్‌పి.అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చి


విద్యుత్ కాంతుల్లో ఆకివీడు పెదపేటలోని బాప్టిస్ట్ చర్చి


విద్యుత్ కాంతుల్లో ఆకివీడు పెదపేటలోని బాప్టిస్ట్ చర్చి


పాలకొల్లు పట్టణంలో లాకుల వద్ద ముస్తాబైన చర్చి


ఉండి చర్చిలో క్రిస్మస్ ట్రీ, స్టార్

చర్చిలలో సందడి

● ఏలూరు రూరల్: గ్రామాల్లో క్రిస్మస్ స్టార్స్, ట్రీ ఏర్పాటు చేసి వివిధ రంగులతో కూడిన చెట్లకు ముస్తాబు చేశారు. చర్చిల వద్ద ఏసుక్రీస్తు జనన ఘట్టాలను ప్రదర్శించారు. మంగళవారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

● ఆకివీడు: పట్టణంలో చర్చిలు సుందరంగా తీర్చిదిద్దారు. పెదపేటలో ఆంధ్రా టౌన్, సెంట్రల్, హోప్, ఉల్లర్థన్‌పేట యునైటెడ్, ఎల్ఈఎఫ్, వార పునంత గాస్పల్ బాప్టిస్ట్ చర్చిలు, మాదివాడ సీబీసీఎన్‌సీ, మేరీమాత ఆర్‌సీఎం, బైపాస్‌రోడ్డు ఇమ్మాన్యుయేల్ ప్రార్థనా మందిరం, జవహర్‌పేట విశ్వాసుల ప్రార్థన సహవాసం, గాంధీనగర్ మిని స్ట్రీస్ చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇళ్లు, కాలనీల్లో క్రిస్మస్ స్టార్స్ ఏర్పాటు చేశారు.

● పాలకొల్లు అర్బన్: పట్టణంలో చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. లాకుల వద్ద, క్రిస్టియన్ పేట, శంభునిపేట, బేత్లహం పేట, మార్కు పేట, పెదపేట, వడ్లవానిపేట, బద్దావానిపేట తదితర ప్రాంతాల్లో చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో స్టార్స్ అలంకరించారు. క్రిస్మస్ ట్రీలకు గిఫ్ట్ బాక్సులు తయారు చేస్తున్నారు.

● మొగల్తూరు: కొండావారిపాలెం, పాలపర్తి వారిపేట లూథరన్ చర్చిలు, ఆర్‌సీఎం చర్చిలు విద్యుత్ దీపాలంకరణ చేశారు. గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. క్రైస్తవులు, మహిళలు వేకువజామునే హల్లెలూయ, క్రీస్తు నేడు పుట్టెను నినాదాలతో ర్యాలీ చేస్తున్నారు.

● పోలవరం: మండలంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. యడ్లగూడెం వలీవల ప్రార్థనా మందిరం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మార్గంలో సీయోను ప్రార్థనా మందిరం, కర్మేలు బైబిలు మిషను ప్రార్థనా మందిరాలలో ప్రార్థనలు నిర్వహించారు. పలుచోట్ల సెమీ క్రిస్మస్ సందర్భంగా అన్నదానాలు నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని భారీ సెట్టింగ్ వేశారు. బాల ఏసుక్రీస్తు, మరియ, యోసేబు, పశువుల పాక, దేవ దూతలు, ఏసుక్రీస్తును పూజించడానికి వచ్చిన జ్ఞానులను ప్రతిబింబించే సెట్ వేశారు. శాంతాక్లాజ్ గిటార్ వాయిస్తున్న బొమ్మలు, క్రిస్మస్ ట్రీ విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

● ఆచంట: మండలంలో చర్చిలను విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొన్ని రోజులుగా ఆయా చర్చిలలో క్రిస్మస్ వేడుకలు వేడుకగా జరుగుతున్నాయి. బుధవారం జరిగే క్రిస్మస్ సందర్భంగా ఆయా చర్చిలు వద్ద సందడి నెలకొంది. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు.

● ఉండి: మండలంలోని చర్చిలు విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఎస్ఆర్‌పి అగ్రహారంలోని ట్రినిటి లూథరన్ చర్చిలో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం పండుగను చేసుకోనున్నారు. ఉండి పెదపేట చర్చి విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఇళ్ల వద్ద క్రిస్మస్ స్టార్స్, క్రిస్మస్ ట్రీలు ఏర్పాటుచేసుకున్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని పలు పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల కరుణామయుడు స్కిట్ అలరించింది. ఈ క్రిస్మస్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


భీమవరం రూపాంతర చర్చిలో బాలల ప్రదర్శన


ఆచంటలో క్రిస్మస్ ప్రార్థనలకు ముస్తాబైన చర్చి



తాడేపల్లిగూడెం పట్టణంలోని పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన


భీమవరంలోని కళాశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


తణుకులో క్రిస్మస్ కేక్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి


తాడేపల్లిగూడెంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి


పెనుగొండ సెమీ క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ


భీమవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యేలు

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కిస్మస్ పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద క్రిస్మస్ వేడుకలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో మంగళవారం నిర్వహించారు. ఆర్డీవో ఖతీబ్‌కౌసర్‌బనో, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పాల్గొన్నారు.

● తణుకు: ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని చర్చిలకు 450 కేకులు మంగళవారం అందజేశారు. నెల రోజుల నుంచి క్రైస్తవులు క్రీస్తు బోధనలతో అందరి కోసం ప్రార్థిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● పెనుగొండ: క్రీస్తు సంఘం, బైబిల్ ఓపెన్ యూనివర్సిస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు. నక్కా వినోద్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కె.ఉపేంద్ర క్రిస్మస్ సందేశం ఇచ్చారు.

● భీమవరం టౌన్: పట్టణంలోని ప్రధాన చర్చిలలో మంగళవారం సాయంత్రం నుంచి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రకాశంచౌక్‌లోని రూపాంతర దేవాలయంలో క్రిస్మస్ వేడుకల్లో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ముఖ్యఅతిథులు పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మండవల్లి మండలం గన్నవరం ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటర్‌లో గోడపై జగన్ ఫొటో

గన్నవరం హెల్త్ సెంటర్‌లో జగన్ ఫొటో

మండవల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్న ప్రభుత్వ కార్యాలయాల్లో చాలాచోట్ల నేటికీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటోలే దర్శనమిస్తున్నాయి. ఏలూరు జిల్లా మండవల్లి మండలం గన్నవరంలోని ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటరు వద్ద నవరత్నాల లోగోతో మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఉండడం విశేషం. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి ఫొటో కాకుండా మాజీ ముఖ్యమంత్రి ఫొటోలు కనిపించేలా ఉంచడంపై కూటమి నాయకులు అధికారుల బాధ్యతారాహిత్యంపై ధ్వజమెత్తుతున్నారు.

చిన వెంకన్న ఆలయ నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.6 లక్షల విరాళం


దాత కుటుంబానికి విరాళం రసీదు అందజేస్తున్న సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు దాత మంగళవారం రూ.6లక్షల విరాళం అందించారు. బెంగళూరుకు చెందిన కాళీచరణ్ బస్వా విరాళాన్ని చెక్ రూపంలో జమచేశారు. ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవ దాత కుటుంబానికి శ్రీవారు, అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించారు.

నందమూరు గరువు ఆంజనేయ ఉత్సవాలు



వీరవాసరం (భీమవరం టౌన్) డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నందమూరుగరువులోని శ్రీరామ భక్త ఆంజనేయ స్వామి ఆలయ మహోత్సవాలు ఈనెల 13 నుంచి నిర్వహిస్తున్నారు. 13 రోజుల పాటు సాగిన ఉత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద దాతల సహకారంతో అఖండ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేశారు. రాత్రి 8 గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శనతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆలయం, పరిసరాల్లో విద్యుత్ దీపాలంకరణ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

లేసు అల్లికలపై డాక్యుమెంటరీ

రెండు రోజులుగా నరసాపురంలో నేషనల్ జియోగ్రాఫిక్ చానల్ షూటింగ్


లేసు ట్రేడింగ్ సెంటర్‌లో షూటింగ్ సందడి

నరసాపురం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): లేసు ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసేందుకు నేషనల్ జియోగ్రాఫిక్ చానల్ మంగళవారం రుస్తుంబాదాలోని లేసు ట్రేడింగ్ సెంటర్‌లో షూటింగ్ నిర్వహించారు. ముంబాయి నుంచి మోడల్స్‌ను రప్పించి కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. సాయంత్రం ఎల్‌బీచర్ల కలవకొలను తాతాజీ లేసు కంపెనీల్లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. రెండు రోజులుగా మార్కెట్, లేసు పార్కుల్లో పలు షాట్‌లను షూట్ చేశారు. అల్లికలు దేశానికి ఎలా వచ్చాయి? ఎలా ప్రాచుర్యం పొందాయి? విదేశాల ఎగుమతి తదితర అంశాలను ప్రజలకు తెలియజేయాలన్న లక్ష్యంతో ఈ చానల్ బయోపిక్ (డాక్యుమెంటరీ) రూపొందిస్తున్నది. 40ఏళ్ళ క్రితం నరసాపురం ప్రాంతానికి చెందిన ఒక లేసు కుటుంబం ముంబాయి వెళ్లి స్థిరపడుతుంది. మళ్లీ చాలా ఏళ్ల తరువాత ఆ కుటుంబానికి చెందిన ఒక మహిళ ఈ ప్రాంతానికి వచ్చి లేసు వస్తువుల్ని కొనుగోలు చేస్తుంది. అనే కథాంశం మీద ఈ డాక్యుమెంటరీని రూపొందిస్తున్నట్టు చిత్ర యూనిట్ చెప్పింది. ఈ షూటింగ్‌కు కావాల్సిన లోకేషన్లు, లేసు వస్తువులను లేసు ట్రేడ్ కన్వీనర్ కలవకొలను తులసీరావ్ సమకూర్చుతున్నారు.

కేబుల్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరిస్తా

ఏపీ రాష్ట్ర ఫైబర్‌నెట్ చైర్మన్ జి.వెంకటరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

పెంటపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేబుల్ ఆపరేటర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఏపీ రాష్ట్ర ఫైబర్‌నెట్ చైర్మన్ జి.వెంకటరెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారానికి కొంత సమయం పడుతుందని కేబుల్ అపరేటర్లు కొంత ఓపిగ్గా ఉండాలన్నారు. మంగళవారం పెంటపాడు ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కేబుల్ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేబుల్ ఆపరేటర్లు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంకటరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. కేబుల్ ఆపరేటర్లపై విధించిన విద్యుత్ పోల్ రెంటల్ చార్జీలను రద్దు చేయాలని, కొత్త సెటప్ బాక్స్‌లు, ఓఎల్‌టీలను అందించడంతో పాటు సర్వీసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన వెంకట రెడ్డి తాను చైర్మన్ అయిన నాటి నుంచి ప్రతి జిల్లాలో పర్యటించి కేబుల్ ఆపరేటర్ల సమస్యలను తెలుసుకుంటున్నానని, ప్రతి సమస్య కూడా పరిష్కారం చేయడం సాధ్యమేనన్నారు. కేబుల్ అపరేటర్లను ఇబ్బందుకు గురి చేసిన ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటి వరకు 410 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామని ఇంకా 210 మందిని గుర్తించడం జరిగిందన్నారు. కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు పాల్గొన్నారు.

మూడు చక్రాల వాహనం ఇప్పించండి



పెనుగొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం ములపర్రు గ్రామానికి చెందిన వేండ్ర మోహనరావు(53) వాహన ప్రమాదంలో కాళ్ళకు దెబ్బలు రెండు కాళ్లు తొలగించారు. ఇతనిది నిరుపేద కుటుంబం. సామాన్య కూలి పని చేసుకుని జీవిస్తాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన యజమానికి రెండు కాళ్లు తొలగించడంతో కుటుంబం రోడ్డున పడింది. దాతలుగాని ప్రభుత్వంగాని ముందుకువచ్చి మూడు చక్రాల వాహనం ఇప్పించాలని కోరుతున్నారు.

పేదల బియ్యం రీసైకిల్ చేస్తే ఉపేక్షించం: జేసీ


రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కౌసర్ భనో

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం రీసైకిల్ చేసేవారిని ఉపేక్షించబోమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలోని శ్రీ శ్రీనివాస అగ్రిప్రొడక్ట్స్ ఇండియా లిమిటెడ్ రైస్‌మిల్లులో ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులో ఉన్న నిల్వలు, ఏ రిజిస్టర్‌లో ఉన్న నిల్వలు, బీ రిజిస్టర్‌లో ఉన్న నిల్వలను పరిశీలించారు. ఓ గదిలో ఉన్న గోనె సంచులను పరిశీలించారు. రైస్‌మిల్ యజమాని గ్రంధి ప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో ఖతీఫ్ కౌసర్ భనో, తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం..

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భర్తతో విడాకులు తీసుకుని విడిగా ఉంటున్న మహిళను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన బొల్లి పాము మంగతాయారు బ్యాండు మేళంలో సింగర్‌గా జీవనం సాగిస్తున్నది. ఆమెకు ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఒక బాబు ఉన్నాడు. కొంతకాలానికి భర్తతో మనస్పర్థలు కారణంగా విడాకులు ఇచ్చి విడిగా ఉంటున్నట్లు తెలిపారు. కొంతకాలం క్రితం అదే గ్రామానికి చెందిన యడ్లపల్లి మంగ రాజు అనే వ్యక్తి మంగతాయారును ప్రేమిం చానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెతో సంబంధం పెట్టుకున్నాడు. అనంతరం బాధితురాలు తనను పెళ్ళి చేసుకొమ్మని అడగడంతో మంగరాజు నిరాకరించాడు. అనంతరం ఈ నెల 17వ తేదీన బాధితురాలు ఇంటికి వెళ్ళి ఆమెను కొట్టి సోషల్ మీడియాలో ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలను పెడతానని బెదిరించాడన్నారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలలో పెట్టగా అక్కడ న్యాయం జరగకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

1న సినీ పాటల పోటీలు

పెనుగొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ రైతు రంకిరెడ్డి వీరన్న సత్యవతి జ్ఞాపకార్థం ఉభయతెలుగు రాష్ట్రాల స్థాయి సినీ పాటల పోటీలను మహర్షి సత్యవతేయ విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఇరగవరం మండలం ఐతంపూడిలో జనవరి 1వ తేదీన రెండు గంటల నుంచి ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ప్రథమ విజేతకు రూ.5 వేలు , ద్వితీయ విజేతకు రూ.3 వేలు, తృతీయ విజేతకు రూ.2 వేలు ఉంటాయని వివరించారు. పూర్తి వివరాలకు కన్వీనర్, చివటం సుబ్బారావు 9849528590 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

జగనన్న కాలనీ లే అవుట్‌పై విజిలెన్స్ విచారణ

ముసునూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముసునూరులో సంధ్యవాగు వద్ద వేసిన జగనన్నకాలనీ లే అవుట్‌పై మంగళవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. ఈ సందర్భంగా రైతులు రేగుల గోపాలకృష్ణ, రేగుల లోకేశ్వరావులతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అనిల్‌కుమార్ సమావేశమై వివరాలను సేకరించారు. ఇళ్ల స్థలాలకు మీకు ఇష్టప్రకారమే భూమి ఇచ్చారా, ప్రభుత్వ నుంచి భూమికి నగదు చెల్లింపులు జరిగాయా, ఎందుకు ఇచ్చిన భూమికి తిరిగి నగదు చెల్లిస్తామని అంటున్నారు, మీకు వచ్చిన ఇబ్బందులు ఏమిటి అని విజిలెన్స్ అధికారి రైతులను అడిగారు. వీటిపై రైతులు మాట్లాడుతూ తమ ఇష్టప్రకారమే ఇళ్ల స్థలాలకు 7.08 ఎకరాల భూమిని ఇచ్చామని, దీని నిమిత్తం ప్రభుత్వం రూ.కోటి 41 లక్షలు చెల్లించిదన్నారు. అయితే గ్రామానికి 4కిలో మీటర్ల దూరంలో లే అవుట్ ఉండటంతో లబ్ధిదారులు అక్కడకు వెళ్ళేందుకు నిరాకరించారని, అందుకనే ప్రభుత్వానికి తిరిగి నగదును కట్టి భూమి తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు రైతులు చెప్పారు. దీనిపై గత ప్రభుత్వంలో ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు సుమారు ఐదుసార్లు వినతపత్రాలు ఇచ్చామని, ప్రస్తుత నూజివీడు శాసన సభ్యులు, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రికి కూడా ఇటీవల వినతపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు.

: జిల్లా వైద్యఆరోగ్యశాఖలో అవినీతిపర్వం తారాస్థాయికి చేరింది. ప్రభుత్వ ప్రాధామ్యాల్లో కీలకమైనశాఖగావున్న ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ జిల్లా పరిధిలో ఓ సాధారణ వైద్యాధికారిగా ఉద్యోగ ప్రవేశంచేసిన ఓ జూనియర్ మెడికల్ ఆఫీసర్ షాడో డీఎంహెచ్‌వోగా వ్యవహరిస్తుండటం చర్చనీయాంశమైంది. సంబంధితశాఖ జిల్లా అధికారి అండదండలతో జిల్లాలోని పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లపై పెత్తనంచేస్తుండటం, నెలవారీ మామూళ్ళను నిర్దేశించడం, నిర్ణీత నగదు టార్గెట్లు ముట్టజెప్పనివారిని ఏదోఒక విషయంలో విచారణలపేరుతో వేధిస్తుండటం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులకు పురుడుపోయకుండా ఏదోఒక వైద్యకారణాన్ని సాకుగా చూపించి స్థానికంగావున్న ఓ కార్పొరేట్ ఆసుపత్రికి రిఫర్ చేయాల్సిందిగా వైద్యాధికారులపై ఒత్తిడిచేయడం, సహకరించని మెడికల్ ఆఫీసర్లపై కక్షసాధింపులు కొంతకాలంగా తీవ్ర మయ్యాయని సమాచారం. తన వెనుక ఓ ఎమ్మెల్యే ఉన్నందున తననేమీ చేయలేరంటూ జిల్లా అధికారి అండదండలతో ఆ మెడికల్ ఆఫీసర్ అక్రమాలకు తెగబడుతున్నారు.

వైద్యశాఖకు అవినీతి రోగం



- ఐదు కీలక విభాగాలకు ఒక్కరే దిక్కు!
- జిల్లా అధికారి మిలాఖత్‌పై ప్రచారం
- వైద్యాధికారులపై వేధింపులు
- ఉద్యోగులకు అక్రమ డిప్యుటేషన్లు
- షాడో వైద్యాధికారికి కొత్త డీఎంహెచ్‌వో చికిత్స తప్పనిసరి

ఏలూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖలో చేపట్టే అన్ని కార్యకలాపాలు, ఉద్యోగులు, మెడికల్ ఆఫీసర్లకు విధుల కేటాయింపు, వారి సర్వీసుల పర్యవేక్షణ, ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతులు, వాటి కార్యకలాపాల పరిశీలన తదితర అంశాలపై డీఎంహెచ్‌వోకు సహకరించేందుకు పరిపాలన విభాగం, ఎఫ్‌డీపీ, ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్, ఐడీఎస్‌పీ, పారామెడికల్ విభాగం తదితర సెక్షన్లు ఉంటాయి. ఈ విభాగాలన్నింటికీ వేర్వేరుగా వైద్యాధికారులు, అధికారులు, పర్యవేక్షకులు ఉండాలి. కాని వీటన్నింటికీ కలిపి ఒకరికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం, అందులోనూ కాంట్రాక్టు ప్రాతిపది కన నియమితులైన ఓ మెడికల్ ఆఫీసర్ తన ప్రొబేషన్‌కాలంలో పలు ఆరోపణలు, విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యం, కొవిడ్ సంక్షోభ రోజుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా వంద రోజుల పాటు విధులకు ఎగనామం పెట్టడం వంటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ ఏరికోరి ఏకంగా ఐదు విభాగాలకు బాధ్యతలు అప్పగించడం వెనుక జిల్లా అధికారి మిలాఖత్ కావడమేనని ప్రచారం జరుగుతోంది. కీలకమైన ఈ ఐదు విభాగాలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడానికి కనీసం కలెక్టర్ నుంచి అనుమతి కూడా తీసుకోకుండానే నియామకాలు జరిగిపోవడం విశేషం. పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటాకోసం రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు ఇటీవల పదిరోజులపాటు చేసిన సమ్మెలో పాల్గొన్నవారిలో కొందరిని టార్గెట్‌గా చేసుకుని వేధింపు చర్యల్లో భాగంగానే ఈ ఐదు విభాగాలకు ఒకరినే నియమించినట్టు మరో ప్రచారం ఉంది. జిల్లా వైద్యఆరోగ్యశాఖలో 'వసూల్ రాజా'గా పేరొందిన అతడిని తన రెండో అవతారంగా జిల్లా అధికారి నియమించుకుని యథేచ్ఛగా స్వలాభం పొందుతున్నట్టు సమాచారం. తనపట్ల ఆ మెడికల్ ఆఫీసర్ చూపిస్తోన్న వీరవిధేయతకు లబ్ధిచేకూర్చే క్రమంలో ప్రొబేషన్ పీరియడ్‌లో పెట్టిన వందరోజుల సెలవు పీరియడ్‌ను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర కార్యాలయానికి కొద్దిరోజుల క్రితమే ప్రతిపాదనలను పంపించడం గమనార్హం. వాస్తవానికి జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో కీలక విభాగాల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో నియమించిన నలుగురు మెడికల్ ఆఫీసర్లు ప్రత్యేకంగా ఉండగా, అవసరమనుకుంటే వీరికి సంబంధిత ఐదు విభాగాల బాధ్యతలను అప్పగించడం లేదా ఇతరులకు అప్పగించవచ్చు. దీనికి భిన్నంగా జిల్లా కేంద్రానికి చేరువగావున్న ఓ పీహెచ్‌సీకి నియమితులైన మెడికల్ ఆఫీసర్‌ను డబ్బులు బాగా దండుకునే దారులున్న ఐదు విభాగాలకు నియమించడాన్ని నిశితంగా పరిశీలిస్తే ....జిల్లాలో ఆ మెడికల్ ఆఫీసర్‌కుమించి సమర్థులెవరూ లేరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు పీహెచ్‌సీ లేదా ఆ ఐదు విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సిన సమయంలో స్థానికంగా వున్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నిబంధనలను తుంగలోతొక్కి డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తుండటాన్ని సంబంధిత ఆస్పత్రి సీసీ టీవీల ఫుటేజ్‌ను పరిశీలిస్తే ఇట్టే అక్రమాలు దొరికిపోతాయని ప్రచారం జరుగుతుండటం గమనార్హం.

అడ్డగోలు డిప్యుటేషన్లకు కళ్ళెం ఎపుడో..

జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఫార్మసిస్టులు, సీనియర్ అసిస్టెంట్లు, ఎంపీహెచ్‌ఈవోలు, అటెండర్లు తదితర కేడర్లలో సుదూర ప్రాంతాల నుంచి అక్రమ డిప్యూటేషన్లు వేసినట్టు తెలుస్తోంది. ఏజెన్సీ మండలాలతోపాటు, పోతునూరు, కె.గోకవరం, చేబ్రోలు, చాటపర్రు, పెదవేగి, కాగుపాడు, దర్భాజీగూడెం, గొల్లపల్లి, దొరమామిడి తదితర పీహెచ్‌సీలతోపాటు, ఏలూరు పీపీ యూనిట్‌వంటిచోట్ల వైద్యసేవల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సినవారిని డీఎంహెచ్‌వో కార్యాలయానికి డిప్యూటేషన్లు ఇవ్వడానికి కనీసం కలెక్టర్ అనుమతులు కూడా లేవని సమాచారం. ఆ మెడికల్ ఆఫీసర్‌ను, మరికొందరిని జిల్లావైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కొనసాగించేందుకు జిల్లాలోని సుదూరప్రాంతాల పీహెచ్‌సీల వైద్యాధికారులను డిప్యూటేషన్లపై వేయడంవల్ల ఆయా పీహెచ్‌సీల్లో వైద్యసేవలకు విఘాతం కలుగుతోందన్న విమర్శలున్నాయి. పీహెచ్‌సీల తనిఖీలకు ఓ ఎంపీహెచ్‌ఈవో, అటెండర్ స్థాయి వ్యక్తులతోకూడిన బృందం వెళుతుండటం, మామూళ్ళు వసూలు చేసుకురావడం ఆ అక్రమార్కుడు, జిల్లా అధికారి అండదండలే కారణమని తెలుస్తోంది. మెడికల్ లీవులను హాజరుపట్టీలో నమోదు చేసే విషయంలోను, తిరిగివారంతా విధుల్లో చేరేటపుడు సమర్పించాల్సిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ విషయంలోను అడ్డదారులు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతులు, తనిఖీలకు కాంట్రాక్టు ఉద్యోగులే నేరుగా వెళ్ళడం, మామూళ్ళు తెచ్చుకోవడం షరామామూలేనని సమాచారం. ఈ నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని తన శాఖలో వేళ్ళూనుకున్న అక్రమాలకు, అడ్డగోలు నియామకాలకు చెక్ పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

క్రైమ్ కార్నర్

ఆ మహిళ ఎవరు?

గాలిస్తున్న పోలీసులు

ఉండి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): యండగండిలో నాగతులసి ఇంటికి మృతదేహాన్ని పార్శిల్ చేసిన ఘటనలో పోలీసులు పురోగతి సాధిస్తున్నారు. ప్రధాన నిందితుడు ముగ్గురు మహిళలకు భర్త అయిన శ్రీధర్ వర్మ (సుధీర్)ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పార్శిల్ చేసిన ఘటనలో కీలకంగా వ్యవహరించిన మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటికీ ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. సుధీర్ వర్మ మూడో భార్య పార్శిల్ చేయడంలో సహకరించారని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఈమె కూడా పోలీసులకు చిక్కలేదు. తన వద్ద పనిచేసిన వ్యక్తినే హత్యచేసి పార్శిల్ చేసిన సుధీర్ వర్మ పోలీస్ కస్టడీలో ఉన్నాడు. విచారణ చేపడుతున్నారు. పార్శిల్‌లో సహకరించిన మహిళ ఆచూకీ లభ్యమైన తర్వాత కేసు వివరాలను పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

కిరాణా వ్యాపారి అదృశ్యం

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గవ్వాది శ్రీనివాసరావు (46) కిరణా వ్యాపారం చేస్తూ ఉంటాడు. ఈనెల 23వ తేదీన కిరణా సరుకులను ఏలూరు వెళ్ళి తీసుకువస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఏలూరు వచ్చాడు. ఏలూరు కొత్తబస్టాండ్‌లోని మోటారు సైకిల్ పార్కింగ్ షెడ్డులో మోటారు సైకిల్ పెట్టినట్లు ఆ గ్రామస్తులు చూశారు. అతను ఎంతకీ రాకపోవడంతో అతనిభార్య ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో ఆందోళనకు గురై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ రైతు మృతి

లింగపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గడ్డి ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం శివారు బుల్లావారిగూడెంకు చెందిన మొలుగుమాటి తిరపతయ్య (53) ఈనెల 16వ తేదీన ట్రాక్టర్‌లో గడ్డి తోలుకువచ్చాడు. గడ్డివాము వద్ద డ్రైవర్ ట్రాక్టర్‌ను వెనుకకు పెడుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ వెనుక చక్రాల కింద పడి తీవ్ర గాయాలపాలవ్వడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఏలూరులో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె. వెంకన్న తెలిపారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని దాడి

మొగల్తూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 20వ తేదీన పేరుపాలెం నార్త్ గ్రామానికి చెందిన అడబాల శ్రీనివాస్‌ను అదే గ్రామానికి చెందిన అడబాల మణికంఠ మద్యం దుకాణం వద్ద డబ్బులు అడిగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో శ్రీనివాస్‌ను కొట్టి గాయపర్చాడు. నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీనివాస్ చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పనిచేస్తున్న ఫైనాన్స్ కంపెనీకే టోకరా

మేనేజర్‌తో పాటు మరో ఉద్యోగి రూ.25 లక్షల మోసం

కైకలూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఫైనాన్స్‌లో నమ్మకంగా పనిచేస్తూ ప్రజలకు రుణాలు ఇప్పిస్తానని వారి ఆస్తి పత్రాలపై రుణాలు పొంది కంపెనీని మోసం చేసిన మోసగాళ్లను కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. కైకలూరులోని కీర్తన ప్రైవేటు ఫైనాన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు రుణాల పేరిట మోసగించి రూ.25 లక్షలు తమ జేబులో వేసుకుని చివరకు కటకటాలపాలయ్యారు. కైకలూరు పరిసర ప్రాంతాల్లో 10 మంది సభ్యులు సొసైటీగా ఏర్పడితే తమ సంస్థ నుంచి రుణాలు అందిస్తామని ప్రజలను మోసం చేశారు. అదే బ్రాంచిలో మేనేజర్‌గా పనిచేస్తున్న రుద్రపాటి సూర్యం అదే బ్రాంచిలో పనిచేస్తున్న రుద్రపాటి స్కైలాబ్ ప్రజల ఆస్తులను వారి సొంత ఆస్తులుగా పెట్టి రూ.25 లక్షలు వరకు రుణాలు పొందారు. అనంతరం వారిద్దరు ఉద్యోగాలు మానివేసి వేరొక సంస్థలో ఉద్యోగాల్లో చేరారు. వీరు పనిచేసిన కాలంలో ఫైనాన్స్ కంపెనీలో తీసుకున్న రుణాలపై ఈ ఈ నెల 13వ తేదీన సంస్థ నిర్వాహకులు జరిపిన తనిఖీల్లో మోసం బయటపడింది. దీంతో కైకలూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సూర్యంను అదుపులోకి తీసుకోగా ఏ-2 అయిన స్కైలాబ్ న్యాయస్థానంలో లొంగిపోయాడు. వీద్దరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో మచిలీ పట్నం జిల్లా జైలుకు తరలించారు. అయితే వీరు చేసిన మోసం సుమారు రూ.40లక్షలకు పైబడి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ఫైనాన్స్‌లో రుణాలు పొందిన ఖాతాదారులు ఈ విషయం తెలిసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్


నెంబర్ ప్లేట్‌ను దగ్గరుండి బిగింప చేయిస్తున్న సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మదీనాబాషా

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెంబర్ ప్లేటు లేని ద్విచక్రవాహనాలపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పలువురికి జరిమానాలు విధించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ సత్యనారా యణ, ఎస్‌ఐ మదీనాబాషా వారి సిబ్బ ంది కలిసి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. నెంబర్ ప్లేటులేని వాహనాలను పార్కింగ్‌లో ఉన్నా గుర్తించి సంబంధిత యజమానిని ఆ వాహనానికి సంబంధించిన రవాణాశాఖ జారీ చేసిన నెంబర్ ప్లేటును తీసుకురావాలని చెప్పి, తీసుకువచ్చిన తరువాత దానిని బిగింప చేయించిన తరువాతే వాహనాన్ని ఇచ్చారు. నెంబర్ ప్లేట్లు తేలేని 40 మందికి జరిమానాలు విధించారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపితే జరిమానాలు విధిస్తామంటూ వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్లు ధరించని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు.

వృద్ధురాలిని బెదిరించి నగలు దోచుకున్న వ్యక్తి అరెస్టు


నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలిని బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పెదవేగి సీఐ కె వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాడు మండలం కొక్కిరపాడు గ్రామానికి చెందిన గుండె సరోజిని (72) నవంబర్ 14వ తేదీ మధ్యాహ్నం ఆమె మనుమడు కలపర్రు టోల్ గేటు సమీపంలో ఉన్న కొక్కిరపాడు క్రాస్ రోడ్డు వద్ద సాయిబాబాగుడికి మోటారుసైకిల్‌పై తీసుకువచ్చి దించి వెళ్ళిపోయాడు. ఆమె తిరిగి ఇంటికి వెళ్ళడానికి రైల్వే గేటు వరకు వచ్చి కొక్కిరపాడు గ్రామం వెళ్ళడానికి నిలబడి ఉంది. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన రేమల్లి సునీల్‌కుమార్ (36) హోండాయాక్టివ్ స్కూటర్ వేసుకుని ఆమె వద్దకు వచ్చి ఆమె వేసుకున్న నగలను చూశాడు. అవి ఎలాగైనా తస్కరించాలని ఆలోచించుకుని తాను కొక్కిరపాడు గ్రామం వెళ్తున్నాని దింపుతానని నమ్మబలికి ఆ వృద్ధురాలిని తన స్కూటర్ ఎక్కించుకున్నాడు. మార్గమధ్యలో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ దగ్గరలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆదిత్య ఖాళీ ప్లాటులోకి తీసుకువెళ్ళి ఆమెపై దాడిచేసి గాయపర్చి మెడలో ఉన్న నాంతాడు, మరో చైను, నాంతాడుకు ఉన్న లాకెట్, ముక్కుకు ఉన్న బంగారు ముక్కు పుడకను తీసుకుని ఆమెను వదిలేసి పరారీ అయ్యాడు. ఈ సంఘటనపై బాధితురాలు పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ కె శారదాసతీష్ కేసు నమోదు చేశారు. జాతీయ రహదారిపై సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడి ఆన వాళ్ళను గుర్తించారు. దీంతో అతనిని మంగళ వారం మధ్యాహ్నం అప్పనవీడులో పశువుల సంతదగ్గర అరెస్టు చేశారు. అతని నుంచి మూడు లక్షల 36 వేల రూపాయల విలువైన బంగారు వస్తువులు, నేరానికి ఉపయోగించిన హోండాయాక్టీవా మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

పేకాట స్థావరంపై దాడి

30 మంది అరెస్టు

రూ.8 లక్షల పది వేలు స్వాధీనం

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తంగెళ్ళమూడి ఎస్ఎంఆర్ నగర్‌లోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో దాడి నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న 30 మందిని అరెస్టు చేసి 8 లక్షల 10 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరుకు చెందిన ఒక రాజకీయ నాయకుడు పేకాట నిర్వహిస్తున్నట్లుగా గుర్తించారు. వివిధ జిల్లాలకు చెందిన పేకాటరాయుళ్ళు ఇక్కడ ఉన్నారు.

బాలికను పెళ్లి చేసుకున్న యువకుడి అరెస్టు

ముదినేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను వివాహం చేసుకున్న ఘటనపై నమోదైన కేసులో నిందితులైన ఇద్దరు యువకులను సోమవారం రాత్రి డీఎస్పీ శ్రావణ్ కుమార్ అరెస్టు చేశారు. అల్లూరుకు చెందిన బి.రోహిత్ అనే యువకుడు ఈనెల 5న 17 ఏళ్ల మైనర్ బాలికను తన స్నేహితుల సహాయంతో వేరే చోటకు తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోమర్రు గ్రామం వద్ద రోహిత్‌తో పాటు పెళ్లి చేసుకునేందుకు అతనికి సహకరించిన బి.పవన్ కుమార్‌ను డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి మంగళవారం కైకలూరు కోర్టులో హాజరుపర్చగా, నిందితులకు మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

ప్రేమించలేదని.. యువకుడి ఆత్మహత్య

ముదినేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను ఓ యువతి తిరస్కరించిందన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ముదినేపల్లి మండలం చినపాలపర్రుకు చెందిన వూసల అజయ్ బాబు (19) రోజువారీ కూలి పనులకు వెళ్తుంటాడు. కొంతకాలంగా ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆ యువతి అతని ప్రేమను అంగీకరించలేదు. ఈ క్రమంలోనే మనస్థాపనానికి గురై ఈ నెల 22న చేవూరు గ్రామం వద్ద పురుగు ముందు తాగాడు. అజయ్ కుటుంబసభ్యులకు స్థానికులు సమాచారం అందించగా వెంటనే గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తండ్రి వెంకట సుబ్బారావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన బొబ్బిలి భాగ్య ప్రియను అదే మండలం కృష్ణంపాలెం గ్రామానికి చెందిన కిరణ్ రెండేళ్ళ క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక పాప ఉంది. ఈ నెల 24 వ తేదీ భాగ్యప్రియ తన భర్త కిరణ్ వేరొక మహిళతో దిగిన ఫొటోలను తన సెల్ ఫోన్ ద్వారా చూపించగా భర్త కోపంతో ఆమె తలను గోడకు కొట్టి చంపుతానని బెదిరించాడు. అంతే కాకుండా కిరణ్ తన భార్యకు వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం అంటగట్టి వేధించాడన్నారు. ఈఘటనపై భార్య ఫిర్యాదు మేరకు భర్త కిరణ్ అతనికి సహకరించే మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు 'సరస్వతీ ప్రసాదం' గ్రంథావిష్కరణ

ఉంగుటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కైకరం శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వ రాలయంలో బుధవారం మధ్యాహ్నం పొన్నపల్లి రామారావు, ప్రత్యుత్తర ప్రదాత జటావల్లభుల జగన్నాథ శాస్త్రి, తలారి వాసు, గిడుగు వెంకటా చలపతి తదితరుల ఆధ్వర్యంలో సరస్వతీ ప్రసాదం గ్రంథావిష్కరణ జరగనుంది. ఈ మేరకు కొచ్చర్లకోట శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మిక జిజ్ఞాసులందరూ పాల్గొనాలని కోరారు.

'కమిషన్ పర్యటనను జయప్రదం చేయాలి'

టి.నరసాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాకు ఈ నెల 27న ఎస్సీ వర్గీకరణపై నియమించిన కమిషన్ పర్యటించనుందని, పర్యటన జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు విస్సంపల్లి సిద్ధూ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అభిప్రాయాలను వినతిపత్రాల రూపంలో కమిషన్‌కు అందచేయాలన్నారు. వర్గీకరణ అంశాన్ని సమర్థించే రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాల నుంచి వారి లెటర్ హెడ్స్‌పై వినతి పత్రాలు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని అందించేలా స్థానిక జిల్లా నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

29న విజయవాడలో రాష్ట్ర కమిటీ సమావేశం

ఏలూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఈ నెల 29న విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కావాలని ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు కోరారు.



గోపన్నపాలెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

వాహనదారులు నిబంధనలు పాటించాలి

దెందులూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపినా, మితి మీరిన వేగంతో నడిపినా కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. దుర్గ విఠల్ అన్నారు. బుధవారం పలు చోట్ల వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మి శ్రీనివాసరావు మృతికి సంతాపం

టి.నరసాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు మృతికి ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షుడు టీవీఎస్ రాజు, అరసం కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. భూ పోరాటంలో పోలీసు కేసులకు బెదరకుండా ఉద్యమాలు చేసిన శ్రీనివాస్ మృతి తీరని లోటన్నారు. మక్కినవారిగూడెం ఏరియా ముఠా వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు కొండముచ్చు శ్రీనివాసరావు, పలువురు సీపీఐ నాయకులు సంతాపం తెలిపారు.

వరి కోతలు వాయిదా వేయాలి

బుట్టాయగూడెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. మంగళవారం అలివేరు, కోటనాగవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్ళు జరుగుతున్నట్టు రబీ సీజన్‌లో ప్రతి రైతు తప్పకుండా ఈ-పంట నమోదు చేసుకోవాలని, వరి, మొక్కజొన్న, అపరాల పంటలకు బీమా అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్న పంటను పరిశీలించి సూచనలిచ్చారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత గుండె వైద్య శిబిరం

కామవరపుకోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీలకర్రగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కళ్ళ చెరువులోని జడ్పీ హైస్కూల్ వద్ద విజయవాడ డాక్టర్ వైవీ రావు ఆస్పత్రి బృందం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించింది. దాదాపు 100 మందికి గుండె పరీక్షలు చేశారు. 15 మందిని విజయవాడలోని ఆసుపత్రికి మరిన్ని పరీక్షల కోసం తీసుకువెళ్ళారు. గుండె వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలపై ఆసుపత్రి సిబ్బంది అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ జీలకర్రగూడెం వ్యవస్థాపకులు ఎస్ఆర్ఆర్ యర్రంరాజు, మహిళా విభాగం నాయకురాలు రత్నకుమారి, క్లబ్ అధ్యక్షుడు చెలికాని కిరణ్, ఉపాధ్యక్షుడు ఆర్.ఆర్.రంగరాజు, కార్యదర్శి బి.బాలవర్థిరాజు, కోశాధికారి పాటిమళ్ళ సుబ్బారావు, బి.సత్యనారాయణరాజు,సురేష్ పాల్గొన్నారు.



పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ అలంకరణలు



మమత హైస్కూలులో విద్యార్థినుల నృత్యాలు





జంగారెడ్డిగూడెంలో సెమీ క్రిస్మస్ వేడుకలు.. విద్యుత్ వెలుగుల్లో లూథరన్ చర్చి



ఈ శుభోదయం..

» క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు » పలు చోట్ల ఘనంగా వేడుకలు

కామవరపుకోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గల చర్చిల వద్ద, ప్రత్యేక ప్రార్థనా స్థలాల వద్ద మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు, చర్చి ఫాదర్లు ఏర్పాట్లు పూర్తి చేశారు. చర్చిలను ముస్తాబు చేశారు. కామవరపుకోట, కొత్తూరు, పాతూరు, ఆడమిల్లి, వీరిశెట్టిగూడెం, తడికలపూడి, కళ్ళచెరువు, గుంటుపల్లి, జీలకర్రగూడెం, రామన్నపాలెం, తూర్పుయడవల్లి, రావికంపాడు, రామన్నపాలెం, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో చర్చిలు, ప్రార్థనా స్థలాలు ముస్తాబయ్యాయి.

పెదపాడు: క్రిస్మస్ వేడుకలకు పెదపాడులోని ఆర్‌సీఎం, సీఎస్ఐ తదితర చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన స్టార్‌లతో పాటుగా పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ ఆకట్టుకుంటోంది.

లింగపాలెం: మండల వ్యాప్తంగా చర్చిలన్నీ రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. గ్రామాలలో క్రైస్తవ సోదరులు తమ ఇళ్లను, ప్రార్థనా మందిరాలను క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లతో అలంకరించి ప్రార్థనలకు సిద్ధమవుతున్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

జంగారెడ్డిగూడెం: పొరుగువారిని ప్రేమించాలని క్రీస్తు బోధనలు అనుసరణీయమని పాస్టర్ బొబ్బర సమ్సోను అన్నారు. సోమవారం రాత్రి స్థానిక రామచంద్ర పురంలో క్రిస్టియన్ ఫెలోషిప్ చర్చి వద్ద సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. టీడీపీ నాయకుడు పరిమి సత్తిపండు ముఖ్యఅతిథి హాజరయ్యారు. క్యాండిల్ సర్వీస్ అనంతరం క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. బొబ్బర రాజ్‌పాల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు రూరల్: రూరల్ మండలంలోని చాటపర్రు మమత హైస్కూల్లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.మమతా రాజ్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. బ్రదర్ కె.సాగర్, రాజేష్, పాస్టర్ ఫ్రాన్సిస్ స్టీఫెన్ రాక్ ముఖ్య అతిథిలుగా పాల్గొని క్రీస్తు సందేశం అందించారు. ప్రేమ, దయతో ఉండాలని క్రీస్తు సందేశాన్ని అందించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు శాంటాక్లాజ్ వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. క్రీస్తు జననం నాటిక ప్రదర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వంకవారిగూడెంలో పీసా గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

సహజ వనరుల అభివృద్ధికి 'పీసా' దోహదం

జీలుగుమిల్లి, డిసెంబరు, 24 : (ఆంధ్రజ్యోతి) : పీసా గ్రామ సభల ద్వారా భూ వివాదాల పరిష్కారం మాత్రమే కాదని ప్రకృతి ద్వారా లభించే సహజ వనరుల అభివృద్ధి, ఆచార, సంప్రదాయాలు మరుగున పడకుండా చూడాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. వంకవారిగూడెంలో పీసా గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వంకవారిగూడెం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. భూముల ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ కొర్స పోశమ్మ, సర్పంచ్ కుంజా పార్వతి, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, ఇన్‌చార్జి తహసీల్దారు స్లీవ జోజి తదితరులు పాల్గొన్నారు.

'పీసా' పటిష్టంగా అమలు చేయాలి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని బుట్టాయగూడెం మండల వ్యాప్తంగా జరిగిన పీసా గ్రామ సభల్లో గిరిజన ప్రజాప్రతినిధులు ముక్తకం ఠంతో నినదించారు. దొరమామిడిలో జరిగిన గ్రామ సభలో ఎన్ఐఆర్‌డీ సీనియర్ ఫ్యాకల్టీ డి.ఏడుకొండలు మాట్లాడుతూ పీసాపై గిరిజనులకు అవగాహన కల్పించడం కోసమే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలవరం: మండలంలో పోలవరం, గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట, కోండ్రుకోట, జిల్లెళ్లగూడెం, చేగొండపల్లి, ఎల్లండీపేట గ్రామాలలో పీసా గ్రామ సభలు నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆయా పంచాయతీల నోడల్ అధికారు లు, సర్పంచులు పాల్గొనగా ఎంపీడీవో ఇ. శ్రీనివాస్ సభలను పర్యవేక్షించారు.

అవగాహన పెంచుకోవాలి

కుక్కునూరు: ప్రతి ఆదివాసీ పీసా చట్టంపై అవగాహన పెంచుకుని తమ హక్కులు కాపాడుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కోరం సంజీవరావు అన్నారు. మంగళవారం ఆదివాసీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసా చట్టం అమలులోకి వచ్చి 30 ఏళ్ళు గడుస్తున్నా ఇంత వరకు పాలకులు పూర్తి స్థాయిలో చట్టాన్ని అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రెవెన్యూ సదస్సులతో రైతు సమస్యల పరిష్కారం

చింతలపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని స్థానిక తహసీల్దార్ ప్రమద్వర అన్నారు. గణిజర్లలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కొందరు రైతులు తమ భూములు పిడబ్ల్యుడిగా చూపెడుతున్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో సచివాలయంలో దరఖాస్తు చేస్తే దానిని సర్వే చేసి మార్పు చేయడం జరుగుతుందని సూచించారు. భూమి యజమాని మరణిస్తే వాటి వారసులు తగు ఆధారాలు ఇవ్వగలిగితే వారి పేరు ఆన్‌లైన్‌లో మార్పు చేస్తామన్నారు. సదస్సులో సర్పంచ్ బి.వెంకట్రావు, కూటమి నాయకులు చీకటి వెంకటేశ్వరరావు, మిద్దే సత్యనారాయణ, గణిదేశి యేసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గణిజర్లలో తహసీల్దార్ ప్రమద్వర దరఖాస్తుల స్వీకారం

లింగపాలెం: మండలంలో రైతుల భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో భూసమస్యలపై 23 అర్జీలు రాగా వాటిలో 3 సమస్యలను పరిష్కరించామన్నారు. డీటీ నాగబాబు, సుసాని సాంబశివరావు, మేడికొండ ప్రసాద్, రెవెన్యూసిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

పెదవేగి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పెదవేగి మండల ప్రత్యేకాధికారి ఎ.రామ్‌కుమార్ అన్నారు. పెదవేగి మండలం బి.సింగవరంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాటాడారు. ఆర్ఐ కేవీవీ సారథి, వెలుగు సర్వేయర్ అబ్బుదాసరి విఠల్‌బాబు, మాజీ సర్పంచ్ పరసా వీరాస్వామి, వీఆర్వో పూర్ణచంద్రరావు, కార్యదర్శి విజయ్, రైతులు పాల్గొన్నారు.



అబ్బబ్బబ్బ ఎంత ముద్దుగున్నయ్యే..

ఆకర్షిస్తున్న రంగు రంగుల కోడిపిల్లలు

ఏలూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కేంద్రంలో రంగురంగుల కోడిపిల్లలు సందడి చేస్తున్నాయి. చిన్నపిల్లలు వీటిని చూస్తే ఇంటికి తీసుకువెళ్ళేదాకా వదిలి పెట్టరు. ఏలూరు దగ్గర్లోని శనివారపుపేట ప్రధాన సెంటర్లో ఈ రంగురంగుల కోడిపిల్లలు (గిరిరాజా కోళ్ళు) పలువుర్ని ఆకట్టుకుంటున్నాయి. చిత్తూరు జిల్లా నుంచి ఇటీవల గన్నవరానికి చెందిన ఓ వ్యక్తి రంగురంగుల కోడిపిల్లల అమ్మకాలు సాగిస్తున్నారు. ఒక్కో కోడిపిల్ల రూ.25లు చొప్పున అమ్మకాలు సాగిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మకాలు చేస్తున్నారు. నాలుగు నెలల్లో కోళ్ళు తయారవుతాయని, ఇందులో పుంజు, పెట్టరకాలు ఉన్నాయి.



ప్ల కార్డులతో ఆందోళన చేస్తున్న కొల్లేటి లంక గ్రామస్థులు

'కొఠారు' దోచుకున్న సొమ్ము కక్కిస్తాం'

పెదవేగి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ కష్టార్జితం దోచుకున్న దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నుంచి ఆ సొమ్మంతా కక్కించే వరకు తమ పోరాటం ఆపేది లేదని కొల్లేటి లంక గ్రామస్థులు నినదించారు. కొండలరావుపాలెంలో కొల్లేటి లంక గ్రామస్థులు కౌలు సొమ్ము కోసం చేస్తున్న ఆందోళన మంగళవారానికి 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కొల్లేరు గ్రామస్థులు మాట్లాడుతూ 2019 నుంచి 2024 ఐదేళ్ళ కౌలు సొమ్ము అడిగితే దాటవేతతో ఐదేళ్ళు గడిపేసి, ఇప్పుడు లండన్‌లో తమ దగ్గర దోచుకున్న సొమ్ముతో జల్సాలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన సొమ్ము ఇచ్చేవరకు పోరాటాన్ని ఆపేది లేదన్నారు. నేతల రవి, సైదు సత్యనారాయణ, నంబూరి నాగరాజు, జయమంగళ దొరబాబు, బాలకృష్ణ, భలే చక్రవర్తి, మోరు విజయరామరాజు, నేపాల జగపతిబాబు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అర్థశాస్త్ర అధ్యాపకుడు బి.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. తూనికలు, కొలతలు, ప్యాకింగ్‌లో జరిగే మోసాలపై వినియోగదారుడు కోర్టు ద్వారా పరిష్కరించు కోవచ్చని కామర్స్ అధ్యాపకుడు ఉత్తమ సాగర్ తెలిపారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు అధ్యక్షత వహించారు.



జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, మోసానికి గురైతే ఎలా వ్యవహరించాలో విద్యార్థులకు తెలియచేశారు. ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, దారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ, ఉమ పాల్గొన్నారు.



అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

నిడమర్రు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకుడు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. మంగళవారం నిడమర్రులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మానవహారం నిర్మించారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

108 సార్లు హనుమాన్ చాలీసా సామూహిక పారాయణ

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని అగ్రహారంలో గల జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఉపాలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తులు 108 సార్లు సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు. కోటదిబ్బ వద్ద గల శ్రీ గణపతి త్రిదేవి పీఠం వద్ద ఆలయ ధర్మకర్త చిందా రాజు, పాండురంగ సెంటర్‌లోని దాసాంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త రెళ్ళ రామకృష్ణ మిత్రబృందం అన్నసమారాధన నిర్వహించారు.

భారీ అన్నసమారాధన

పోలవరం: గూటాల అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమద్రవ్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. జనసేన మండల నాయకులు మొగళ్ళ హరిబాబు, ఆటపాకల వెంకటేశ్వరరావు పూజా కార్యక్రమాల్లో పాల్గొనగా ఆలయ నిర్వాహకులు వారిని సత్కరించారు. టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు డోకల నాగేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధికాదాయం

ఉద్యాన శాఖాధికారిణి రత్నమాల

పెదవేగి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న పెట్టుబడికి అనుగుణంగా ఆదాయం అందుకోవాలంటే అంతరపంటల సాగు ఒక్కటే మార్గమని పెదవేగి మండల ఉద్యాన శాఖాధికారిణి కె.రత్నమాల అన్నారు. పెదవేగి మండలం అంకన్నగూడెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగు, అంతర పంటలతో కలిగే లాభాలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ ఉద్యానవన పంటల్లో అంతరపంటల సాగు రైతులకు మేలు చేస్తుందన్నారు. కొబ్బరి, పామాయిల్ వంటి పంటల్లో ఎక్కువగా కోకోసాగు జరుగుతుందని, అంతరపంటల సాగులో మేలైన యాజమాన్య విధానాలను పాటిస్తే మరింత మెరుగైన ఆదాయం లభిస్తుందని ఆమె చెప్పారు. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం రాయితీలతోకూడిన ప్రోత్సాహకాలు అందిస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రత్నమాల రైతులకు సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అడవికొలనులో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

నిడమర్రు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి తాతారావు అన్నారు. మంగళవారం అడవికొలనులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజను కోసం క్రిమిసంహారక నాశికంగా బ్రహ్మాస్త్రం 40ను, గ్రోత్ ప్రమోటర్‌గా కోడిగుడ్డు, నిమ్మరసం, బెల్లం ద్రావణం తయారు చేసి రైతులకు అందజేశారు. ఏవో గీతాదేవి, ఏఈవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ వలయంలో ద్వారకాతిరుమలలో ప్రధాన రహదారి(ఫైల్)

ట్రాఫికర్‌కు చెక్..

ద్వారకాతిరుమలలో ఆక్రమణదారులకు నోటీసులిచ్చేందుకు రంగం సిద్ధం

ద్వారకాతిరుమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణలో భాగంగా ఆక్రమణదారులకు, గృహ యజమానులకు నోటీసులిచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ఏ మేరకు ఆక్రమణలు తొలగించాలి.. ఎంత విస్తరణతో రహదారి నిర్మించాలి అన్న అంశంపై చర్చించారు. కొన్నేళ్లుగా ద్వారకాతిరుమల మెయిన్ రోడ్డు విస్తరణ వ్యవహారం కోర్టు ఉత్తర్వుల కారణంగా నిలిచిపోయింది. తాజాగా మరలా ఆక్రమణల తొలగింపు వ్యవహారం తెరపైకి రావడంతో గ్రామంలో అది చర్చనీయాంశమైంది.



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే చంటి

వైసీపీ అస్తవ్యస్త పాలనతో అప్పుల ఊబిలో రాష్ట్రం

ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అస్తవ్యస్త పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఎమ్మెల్యే చంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఆరునెలల నుంచి ప్రతి రోజు ప్రజల సమస్యలు పరిష్కరిస్తూనే ఉన్నామన్నారు. ఏ సమయంలోనైనా ప్రజలు తనను కలిసి సమస్యలు చెప్పుకోవచ్చన్నారు.

ముగిసిన వారోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తూనికలు కొలతల శాఖ నిబంధనలు, చట్టాలపై వినియోగదారులు, వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలను ఈ నెల 18 నుంచి 24 వరకు నిర్వహించినట్టు తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కమిషనర్ బి.వి.హరిప్రసాద్ తెలిపారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు, కొనుగోలుదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించామన్నారు. వంట నూనెలు, వివిధ రకాల వస్తువులు, బంకుల వద్ద కొనుగోలు తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎమ్మార్పీలు చూసుకునే విధానంపై అవగాహన కల్పించామన్నారు. బంకుల వద్ద మీటర్ రీడింగ్‌లు, కొలమానాలపై వివరించామన్నారు. మోసాలకు గురికాకుండా వ్యవహరించాల్సిన పద్ధతులపై వివరించామని చెప్పారు. ఆయన వెంట ఆ శాఖ ఉద్యోగులు సుధాకర్, సాయిరాం, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా (ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన)ను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని నెలాకరులోపు ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి ఎన్.ప్రవీణ్ కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని వెల్లమిల్లి, ఉంగుటూరు-2 సచివాలయాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు దాళ్వా నారుమళ్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

భోజనాల వితరణ

చింతలపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భట్టువారిగూడెం రోడ్డులో ఉన్న అనాథ పిల్లల ఆశ్రమంలో క్రిస్మస్ సందర్భంగా స్థానిక వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నాగకుమార్ అన్నదానం చేశారు. అనాథ పిల్లలను ఆదుకోవడమే ఉత్తమ సేవ అన్నారు.

క్రైమ్ కార్నర్

ఎక్సైజ్ దాడులు

చింతలపూడి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వెంకటాపురం, కృష్ణాపురం గ్రామాల్లో అధికారులు దాడులు జరిపారు. వెంకటాపురంలో జక్కుల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కృష్ణాపురం అటవీ ప్రాంతంలో నిల్వ ఉంచిన 900 లీటర్ల బెల్లపు ఊటను కనుగొని ధ్వంసం చేశారు. అదే గ్రామంలో భూక్యా నాగప్రసాద్ అనే వ్యక్తి ఇంట్లో 200 లీటర్ల బెల్లపు ఊటను కనుగొని ధ్వంసం చేశారు. వీరిని తహసీల్దార్ వద్ద హాజరుపరిచి బైండోవర్ చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. అనంతరం గ్రామంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా గంజాయి, డ్రగ్స్, సారా తో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.

పేకాట స్థావరంపై దాడి

జీలుగుమిల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురం సమీపంలో పేకాట స్థావరంపై సీఐ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు దాడులు చేశారు. పొలాల్లో పేకాడుతున్న ఆరుగురు జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.నవీన్‌కుమార్ చెప్పారు. 6 సెల్ ఫోన్లు, 5 మోటర్ సైకిళ్లు, రూ.4500 నగదు స్వాధీనం చేసుకున్నారు.



ఏలూరు మన్నా చర్చిలో కొవ్వొత్తులతో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

శాంతికి చిహ్నం క్రిస్మస్

- వేడుకలకు ముస్తాబైన చర్చిలు
- విద్యుత్ వెలుగుల నక్షత్రాలు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- చిన్నారి శాంతాక్లాజ్‌ల సందడి

ఏలూరు టూటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. క్రీస్తు జన్మించి 2వేల సంవత్సరాలు అయినప్పటికి కరుణామయుడిగా ఆరాధనలు అందుకుంటున్నారు. రెండు వేల సంవత్సరాల క్రితం రోమ్ సామ్రాజ్యాధినేత అగస్టస్ సీజర్ తన రాజ్యంలో జనాభా ఎంతున్నారో తెలుసుకోవాలనుకున్నారు. ప్రజలందరిని డిసెంబరు 25లోపు స్వగ్రామాలకు వెళ్లాలని అజ్ఞాపించారు. అదే సమయంలో నజరేతు అనే ఊరిలో మరియమ్మ, యోసేబులకు ప్రదానం అయ్యింది. అప్పటికి పెళ్లి కాలేదు. ఈ లోపు మరియమ్మకు కలలో దేవదూత గాబ్రియేల్ కనిపించి నేడు దేవుని అనుగ్రహం పొందావు. పరిశుద్ధ ఆత్మతో గర్భం దాల్చి కుమారుడిని కంటావు. ఆ బిడ్డకు ఏసు అని పేరు పెట్టాలి. ఏసు అంటే రక్షకుడు అని అర్థం. మరియమ్మ దేవదూత మాటలపై విశ్వాసంతో దేవుడిని ప్రార్థించింది. అనంతరం పరిశుద్ధ ఆత్మతో గర్భం దాల్చింది. ఇదే విషయాన్ని మరియకు ప్రదానం చేసిన యోసేబుకు కూడా దేవదూత కనపడి మరియమ్మ పరిశుద్ధ ఆత్మతో గర్భం ధరించింది. ఆమెకు పుట్టే బిడ్డ పరిశుద్ధ ఆత్మడై దేవుని కుమారుడు అనబడును. ఆయన తన ప్రజలందరిని వాళ్ల పాపాల నుంచి రక్షిస్తాడని చెప్పాడు. దేవదూత మాటలతో యోసేబు మరియమ్మను తీసుకుని స్వగ్రామం బెత్లహేమ్‌కు బయల్దేరి వెళ్లాడు. అక్కడ వారికి ఎటువంటి వసతి దొరకనందున పశువుల పాకలో ఆశ్రయం దొరికింది. పశువుల పాకలోనే మేరి ఏసుకు జన్మనిచ్చింది. ఆ సమయంలో ఆకాశం నుంచి దేవదూత దిగివచ్చి గొర్రెల కాపరులు మీ కొరకు బెత్లహేమ్‌లో పశువుల పాకలో రక్షకుడు పుట్టాడు. అయనే ప్రభువైన ఏసుక్రీస్తు ఆయనే మీ అందరికి ప్రభువు. బెత్లహేమ్‌లో పశువుల తొట్టిలో పొత్తిగుడ్డలతో చుట్టి మరియతో ఉంటాడు. అతడే లోకరక్షకుడు అని దేవదూత చెప్పింది. ఆ గొర్రెల కాపర్లు ఏసుపుట్టిన చోటుకు వెళ్లి ఆయనను ఆరాధిస్తారు. ఏసుపుట్టిన రోజునే క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారు.

● ఏలూరు రూరల్: గ్రామాల్లో క్రిస్మస్ స్టార్స్ ట్రీ ఏర్పాటు చేసి వివిధ రంగులతో కూడిన చెట్లకు ముస్తాబు చేశారు. చర్చిల వద్ద ఏసుక్రీస్తు జనన ఘట్టాలను ప్రదర్శించారు. మంగళవారం రాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

● పోలవరం: మండలంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. యడ్లగూడెం వలీవల ప్రార్థనా మందిరం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మార్గంలో సీయోను ప్రార్థనా మందిరం, కర్మేలు బైబిలు మిషను ప్రార్థనా మందిరాలలో ప్రార్థనలు నిర్వహించారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా అన్నదానాలు నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని భారీ సెట్టింగ్ వేశారు. బాల ఏసుక్రీస్తు, మరియ, యోసేబు, పశువుల పాక, దేవదూతలు, ఏసుక్రీస్తును పూజించడానికి వచ్చిన జ్ఞానులను ప్రతిబింబించే సెట్ వేశారు. శాంతాక్లాజ్ గిటార్ వాయిస్తున్న బొమ్మలు, క్రిస్మస్ ట్రీ విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్



నంబర్ ప్లేట్‌ను దగ్గరుండి బిగింప చేయిస్తున్న సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మదీనాబాషా

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెంబర్ ప్లేటు లేని ద్విచక్రవాహనాలపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పలువురికి జరిమానాలు విధించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ సత్యనారాయణ, ఎస్ఐ మదీనాబాషా వారి సిబ్బంది కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నెంబర్ ప్లేటులేని వాహనాలను పార్కింగ్‌లో ఉన్నా గుర్తించి సంబంధిత యజమానిని ఆ వాహనానికి సంబంధించిన రవాణాశాఖ జారీ చేసిన నెంబర్ ప్లేటును తీసుకురావాలని చెప్పి, తీసుకువచ్చిన తరువాత దానిని బిగింపచేయించిన తరువాతే వాహనాన్ని ఇచ్చారు. నెంబర్ ప్లేట్లు తేలేని 40 మందికి జరిమానాలు విధించారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపితే జరిమానాలు విధిస్తామ ంటూ వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్లు ధరించని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు.

వృద్ధురాలిని బెదిరించి నగలు దోచుకున్న వ్యక్తి అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలిని బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పెదవేగి సీఐ కె వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాడు మండలం కొక్కిరపాడు గ్రామానికి చెందిన గుండె సరోజిని నవంబరు 14న ఆమె మనుమడు కలపర్రు టోల్ గేటు సమీపంలో ఉన్న కొక్కిరపాడు క్రాస్ రోడ్డు వద్ద సాయిబాబాగుడికి మోటారుసైకిల్‌పై దించి వెళ్లిపోయాడు. ఆమె తిరిగి ఇంటికి వెళ్ళడానికి రైల్వే గేటు వద్ద నిలబడి ఉంది. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన రేమల్లి సునీల్‌కుమార్ స్కూటర్‌పై ఆమె వద్దకు వచ్చి ఆమె వేసుకున్న నగలను చూశాడు. ఎలాగైనా తస్కరించాలని ఆలోచించుకుని తాను కొక్కిరపాడు గ్రా మం వెళ్తున్నాని దింపుతానని నమ్మబలికి ఆ వృద్ధురాలిని తన స్కూటర్ ఎక్కించు కున్నాడు. మార్గమధ్యలో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ దగ్గరలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆదిత్య ఖాళీ ప్లాటులోకి తీసు కువెళ్ళి ఆమెపై దాడిచేసి గాయపర్చి మెడ లో ఉన్న నాంతాడు, మరో చైను, నాంతాడుకు ఉన్న లాకెట్, ముక్కుకు ఉన్న బంగారు ముక్కుపుడకను తీసుకుని ఆమెను వదిలేసి పరారీ అయ్యాడు. ఈ సంఘటనపై బాధితురాలు పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కె శారదాసతీష్ కేసు నమోదు చేశారు. జాతీయ రహదారిపై సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడి ఆన వాళ్ళను గుర్తించారు. దీంతో అతనిని మంగళ వారం మధ్యాహ్నం అప్పనవీడులో పశువుల సంతదగ్గర అరెస్టు చేశారు. అతని నుంచి మూడు లక్షల 36 వేల రూపాయల విలువైన బంగారు వస్తువులు, నేరానికి ఉపయోగించిన హోండాయాక్టీవా మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

'కమిషన్ పర్యటనను జయప్రదం చేయాలి'

టి.నరసాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జల్లాకు ఈ నెల 27న ఎస్సీ వర్గీకరణపై నియమించిన కమిషన్ పర్యటించనుందని, పర్యటన జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు విస్సంపల్లి సిద్ధూ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఐఎఫ్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అభిప్రాయాలను వినతిపత్రాల రూపంలో కమిషన్‌కు అందచేయాలన్నారు. వర్గీకరణ అంశాన్ని సమర్థించే రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాల నుంచి వారి లెటర్ హెడ్స్‌పై వినతి పత్రాలు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని అందించేలా స్థానిక జిల్లా నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గన్నవరం హెల్త్ సెంటర్‌లో జగన్ ఫొటో



గన్నవరం ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటర్‌లో గోడపై జగన్ ఫొటో

మండవల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్న ప్రభుత్వ కార్యాలయాల్లో చాలాచోట్ల నేటికీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటోలే దర్శనమిస్తున్నాయి. ఏలూరు జిల్లా మండవల్లి మండలం గన్నవరంలోని ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటరు వద్ద నవరత్నాల లోగోతో మాజీ ముఖ్య మంత్రి జగన్ ఫొటో ఉండడం విశేషం. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి ఫొటో కాకుండా మాజీ ముఖ్యమంత్రి ఫొటోలు కనిపించేలా ఉంచడంపై కూటమి నాయకులు అధికారుల బాధ్యతాహిత్యంపై ధ్వజమెత్తుతున్నారు.



చాట్రాయి మండలంలోని మర్లపాలెం చర్చి.. ముసునూరు మండలం కాట్రేనిపాడులలో చర్చిలకు విద్యుత్ దీపాలంకరణ

క్రిస్మస్ సందడి

చాట్రాయి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కిస్మస్ సందర్భంగా మండలంలో చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చాట్రాయి ఆర్సీఎం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీస్తు జననం పశువుల పాక ప్రత్యేక ఆకర్షణగా ఉంది. కిస్మస్ సందర్భంగా వస్త్రాలు, స్టార్సు, శాంతాక్లాజ్‌లు, ఇతర వస్తువులు అమ్మే దుకాణాలు సందడిగా మారాయి.

ముసునూరు: క్రైస్తవ దేవాలయాలు క్రిస్మస్ వేడుకలు అత్యంత సుందరంగా ముస్తాబయ్యాయి. కాట్రేనిపాడు, ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల, చెక్కపల్లి, రమణక్కపేట, చింతలవల్లి తదితర గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రీస్తు జన్మించిన పశువులపాక, దేవదూతలు వంటి ప్రతిమలు ఏర్పాటు చేశారు.

ఆరు అర్జీల అందజేత

చాట్రాయి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చిత్తపూరు, పోతనపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండల స్పెషలాఫీసర్ వెంకటరత్నం, తహసీల్దార్ ప్రశాంతి ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. మొత్తం 6 అర్జీలు వచ్చినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దామెర బుచ్చిబాబు, కొత్తపల్లి రామదాసు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేప ద్రావణాన్ని పిచికారీ చేయాలి

నూజివీడు టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):ముసురు వాతావరణంలో చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందని, వీటి నివారణకు వేపద్రావణాన్ని 2మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని నూజివీడు వ్యవసాయశాఖ అధికారిణి చాముండేశ్వరి తెలిపారు. బత్తులవారిగూడెం, సుంకొల్లు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూక్ష్మదాతువు లోప నివారణకు చిలేటెడ్ జింక్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి మొక్కజొన్న పైరులో పిచికారి చేయాలని తెలిపారు. వరికోసిన నేపథ్యంలో టార్పాలిన్ పట్టాలతో పంటలను కప్పుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారిణి ఆర్.హేమ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నూజివీడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):సగర కులస్థులకు ఏ కష్టంవచ్చినా అండగా ఉంటామని, తెలుగుదేశంపార్టీ సగర సాధికార రాష్ట్ర అధ్యక్షులు జంపన వీర శ్రీనివాస్ అన్నారు. గొల్లపల్లి గ్రామంలో రోడ్డుప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్‌మీడియా కోఆర్డినేటర్ జి.గణేష్, చెక్కపల్లి సర్పంచ్ సత్యనారాయణ, బీసీసెల్ నాయకులు నక్కా యోహాను పాల్గొన్నారు.

చింతలపూడి పనులు పునఃప్రారంభించాలని సీఎంకు వినతి



సీఎం చంద్రబాబుతో బొట్టు వంశీ తదితరులు

చాట్రాయి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును సోమవారం అమరావతిలో ఎన్నారై టీడీపీ నాయకుడు బొట్టు వంశీ, మండల టీడీపీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు కలిసి చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను పునఃప్రారంభించి, మెట్ట భూములకు గోదావరి జలాలు అందించాలని వినతిపత్రం అందజేశారు. ఈ పథకం పూర్తయితే ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలో 5 లక్షల ఎకరాలు మెట్ట భూములు సస్యశ్యామలం అవటంతో పాటు వందల గ్రామాలకు తాగునీరు అందుతుందని సీఎంకు వివరించారు.

జగనన్న కాలనీ లే అవుట్‌పై విజిలెన్స్ విచారణ



తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

ముసునూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముసునూరులో సంధ్యావాగు వద్ద వేసిన జగనన్నకాలనీ లే అవుట్‌పై మంగళవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. ఈ సందర్భంగా రైతులు రేగుల గోపాలకృష్ణ, రేగుల లోకేశ్వరావులతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అనిల్‌కుమార్ సమావేశమై వివరాలను సేకరించారు. ఇళ్ల స్థలాలకు మీకు ఇష్టప్రకారమే భూమి ఇచ్చారా, ప్రభుత్వ నుంచి భూమికి నగదు చెల్లింపులు జరిగాయా, ఎందుకు ఇచ్చిన భూమికి తిరిగి నగదు చెల్లిస్తామని అంటున్నారు, మీకు వచ్చిన ఇబ్బందులు ఏమిటి అని విజిలెన్స్ అధికారి రైతులను అడిగారు. వీటిపై రైతులు మాట్లాడుతూ తమ ఇష్టప్రకారమే ఇళ్ల స్థలాలకు 7.08 ఎకరాల భూమిని ఇచ్చామని, దీని నిమిత్తం ప్రభుత్వం రూ.కోటి 41 లక్షలు చెల్లించిదన్నారు. అయితే గ్రామానికి 4కిలో మీటర్ల దూరంలో లే అవుట్ ఉండటంతో లబ్ధిదారులు అక్కడకు వెళ్ళేందుకు నిరాకరించారని, అందుకనే ప్రభుత్వానికి తిరిగి నగదును కట్టి భూమి తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు రైతులు చెప్పారు. దీనిపై గత ప్రభుత్వంలో ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు సుమారు ఐదుసార్లు వినతపత్రాలు ఇచ్చామని, ప్రస్తుత నూజివీడు శాసనసభ్యులు, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రికి కూడా ఇటీవల వినతపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం తమ భూమికి ఇచ్చిన నగదును పూర్తిస్థాయిలో కట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు రైతులు చెప్పారు. అలాగే వీఆర్వో మస్తానరావు నుంచి కూడా ఈ లే అవుట్‌పై విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అనిల్‌కుమార్ తెలిపారు.

చిత్తపూరులో సాగుదారుల ర్యాలీ

చాట్రాయి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పేదలు సాగు చేసుకుంటున్న భూములను జాయింట్ కలెక్టర్ పరిశీలించి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ చిత్తపూరులో మంగళవారం సాగుదారులు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు చాట్ల బాబూరావు, వేముల బక్కయ్య మాట్లాడుతూ చిత్తపూరు గ్రామంలో సుమారు 300 మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు చెందిన పేదలు వందల ఎకరాల ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటూ జీవనం చేస్తున్నారని అన్నారు. ఈ భూములకు పట్టాలు లేకపోవటం వలన రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటలకు మద్దతు ధర అందక నష్టపోతున్నారని అన్నారు.

ఇల్లు దగ్ధం

చాట్రాయి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చిన్నంపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొమ్ము లక్ష్మికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఫోన్ చేసినా ఫైర్ ఇంజిన్ రాలేదని, స్థానిక యువకులు ఎంత ప్రయత్నించినా మంటల అదుపుకాకపోవటంతో ఇల్లు అగ్నికి ఆహూతి అయ్యిందని గ్రామస్తులు చెప్పారు. కూలీ చేసుకొని కూడబెట్టిన రూ.19వేల నగదు, 8 బస్తాల ధాన్యం, 3 కాసుల బంగారు నానుతాడు, కిస్మస్ పండగకు కుమార్తెలు మనవళ్ళు మనవరాళ్ళకు కొన్న కొత్త బట్టలు కాలిపోయి కట్టు బట్టలతో మిగిలామని బాధితురాలు కొమ్ము లక్ష్మి విలపించారు. కాలిపోయిన ఇంటిని వీఆర్వో సత్యనారాయణ పరిశీలించి నష్టం వివరాలను నమోదు చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ముసునూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మంగళవారం ముసునూరు డిప్యూటీ తహసీల్దార్ కె.వి రమణకు ఆయన వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నష్టం కలిగించేలా కేంద్రం తీసుకువచ్చిన వివిధ రకాల నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. వ్యవసాయ బోర్లుకు స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతారని అన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

ముసునూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తమ శర్మ అన్నారు. మంగళవారం కాట్రేనిపాడులో జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన ఆర్జీలను స్వీకరించారు. భూసమస్యలపై 9 ఆర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, మాజీ సర్పంచ్ బొమ్మగంటి శ్యామలరావు పాల్గొన్నారు.



పేరూరు రెవెన్యూ సదస్సులో డీసీ వైస్ చైర్మన్ పేర్నీడును సత్కరిస్తున్న మాధవీ రాణి

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

ముదినేపల్లి/ మండవల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించుకోవడం రైతులకు మంచిదని, అందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకోవాలని ముదినేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ హనుమార పేర్నీడు తెలిపారు. పేరూరులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ముదినేపల్లి డీసీ పరిధిలో సాగునీటి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పేర్నీడును సర్పంచ్ పుట్టి మాధవీ రాణి, టిడిపి నాయకులు పుట్టి లక్ష్మణ స్వామి సత్కరించారు. తహసీల్దార్ సుభానీకి రైతులు అర్జీలు అందజేశారు.

రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకుని తమ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని నియోజకవర్గ టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు ముళ్ళపూడి సత్తిబాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాల్ పేర్కొన్నారు. మండవల్లి మండలం మూడుతాళ్లపాడు గ్రామ సచివాలయంలో మంగళవారం సర్పంచ్ ముత్యాల సులోచన కుమారి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో పాసుపుస్తకాల కోసం రెండు, సబ్ డివిజన్ కోరుతూ రెండు అర్జీలు వచ్చినట్టు ఆర్పీఐ శ్రావణి తెలిపారు. వీఆర్వో వీర్రాజు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ ఏడీ లలితసుధ

కలిదిండి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా రీసోర్స్ సెంటర్ ఏడీ డి.లలిత సుధ అన్నారు. గోపాలపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ సాగుతో తక్కువ పెట్టుడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. మండల వ్యవసాయ అధికారి విద్యాసాగర్, మండల మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.



ముదినేపల్లి ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

ముదినేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ముదినేపల్లిలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ మరియ దాసు అధ్వర్యంలో బాలఏసు జననంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం వద్ద వందలాది మంది క్రైస్తవులు దూప పూజలు నిర్వహించారు. చర్చిలో ప్రార్థనలు జరిపారు. గాడ్స్ లవ్ సంస్థ అధ్వర్యంలో బెతెస్తా పెంతెకోస్తు చర్చిలో ఫాదర్ కటికల ప్రభుదాసు, కొత్తపల్లిలోని పునీత జాన్ మరియ వియాన్ని గురు మండలం చర్చిలో ఫాదర్ జైరాజు ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహిం చారు.



ముదినేపల్లి ఆర్‌సీఎం చర్చి వద్ద క్రీస్తు జననం తెలిపే ప్రదర్శన

ధాన్యం నాణ్యతను పరిశీలించుకోవాలి

జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలక్ష్మి

ముదినేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ వద్ద ఉన్న ధాన్యం నాణ్యతా ప్రమాణాలను రైతు సేవా కేంద్రాల్లో పరిశీలించుకోవాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ వి.శ్రీలక్ష్మి విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో స్వల్పంగా రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వ మార్గదర్శక సూత్రాల ప్రకారం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ముదినేపల్లి మండలంలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో 2,926 మంది రైతుల నుంచి ఇప్పటి వరకు 16 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.44.50 కోట్ల విలువైన 19,378 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రైతుల బ్యాంక్ ఖాతాలకు రూ.38.13 కోట్లు జమ అయిందని, మిగిలిన రూ.6.30 కోట్లు జమ చేసే ప్రక్రియ జరుగుతోందన్నారు.

పనిచేస్తున్న ఫైనాన్స్ కంపెనీకే టోకరా

మేనేజర్‌తో పాటు మరో ఉద్యోగి రూ.25 లక్షల మోసం

కైకలూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఫైనాన్స్‌లో నమ్మకంగా పనిచేస్తూ ప్రజలకు రుణాలు ఇప్పిస్తానని వారి ఆస్తి పత్రాలపై రుణాలు పొంది కంపెనీని మోసం చేసిన మోసగాళ్లను కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. కైకలూరులోని కీర్తన ప్రైవేటు ఫైనాన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు రుణాల పేరిట మోసగించి రూ.25 లక్షలు తమ జేబులో వేసుకుని చివరకు కటకటాల పాలయ్యారు. కైకలూరు పరిసర ప్రాంతాల్లో 10 మంది సభ్యులు సొసైటీగా ఏర్పడితే తమ సంస్థ నుంచి రుణాలు అందిస్తామని ప్రజలను మోసం చేశారు. అదే బ్రాంచిలో మేనేజర్‌గా పనిచేస్తున్న రుద్రపాటి సూర్యం అదే బ్రాంచిలో పనిచేస్తున్న రుద్రపాటి స్కైలాబ్ ప్రజల ఆస్తులను వారి సొంత ఆస్తులుగా పెట్టి రూ.25 లక్షలు వరకు రుణాలు పొందారు. అనంతరం వారిద్దరు ఉద్యోగాలు మానివేసి వేరొక సంస్థలో ఉద్యోగాల్లో చేరారు. వీరు పనిచేసిన కాలంలో ఫైనాన్స్ కంపెనీలో తీసుకున్న రుణాలపై ఈనెల 13న సంస్థ నిర్వాహకులు జరిపిన తనిఖీల్లో మోసం బయటపడింది. దీంతో కైకలూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సూర్యంను అదుపులోకి తీసుకోగా ఏ-2 అయిన స్కైలాబ్ న్యాయస్థానంలో లొంగిపోయాడు. వీరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో మచిలీపట్నం జిల్లా జైలుకు తరలించారు. అయితే వీరు చేసిన మోసం సుమారు రూ.40లక్షలకు పైబడి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ఫైనాన్స్‌లో రుణాలు పొందిన ఖాతాదారులు ఈ విషయం తెలిసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాలికను పెళ్లి చేసుకున్న యువకుడి అరెస్టు

ముదినేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను వివాహం చేసుకున్న ఘటనపై నమోదైన కేసులో నిందితులైన ఇద్దరు యువకులను సోమవారం రాత్రి డీఎస్పీ శ్రావణ్ కుమార్ అరెస్టు చేశారు. అల్లూరుకు చెందిన బి.రోహిత్ అనే యువకుడు ఈనెల 5న 17 ఏళ్ల మైనర్ బాలికను తన స్నేహితుల సహాయంతో వేరే చోటకు తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోమర్రు గ్రామం వద్ద రోహిత్‌తో పాటు పెళ్లి చేసుకునేందుకు అతనికి సహకరించిన బి.పవన్ కుమార్‌ను డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి మంగళవారం కైకలూరు కోర్టులో హాజరు పర్చగా, నిందితులకు మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

ప్రేమించలేదని.. యువకుడి ఆత్మహత్య

ముదినేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను తిరస్కరించిందన్న మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. చినపాలపర్రుకు చెందిన పూసల అజయ్ బాబు (19) కూలి పనులకు వెళ్తుంటాడు. కొంతకాలంగా ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆమె అతని ప్రేమను అంగీకరించలేదు. ఈ క్రమంలోనే మనస్థాపానికి గురై ఈనెల 22న చేవూరు గ్రామం వద్ద పురుగు ముందు తాగాడు. అజయ్ కుటుంబసభ్యులకు స్థానికులు సమాచారం అందించగా వెంటనే గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తండ్రి వెంకట సుబ్బారావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.